

14న సాగునీటి సంఘాల ఎన్నికలు

పుట్టపర్తి టౌన్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మైనర్ ఇరిగేషన్ చెరువుల సాగునీటి సంఘాల ఎన్నికలు ఈనెల 14న నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 214 సూక్ష్మ, 16 మధ్యస్త నీటిపారుదల ప్రాజెక్టులున్నాయన్నారు. సూక్ష్మనీటిపారుదల పరిధిలోని చెరువులకు 14న ఎన్నికలు ఉంటాయన్నారు. ఈమేరకు మంగళవారం గెజిట్ విడుదల చేశారు. ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ల జాబితాను సిద్ధం చేశామని కలెక్టర్ వివరించారు.

ఇక గతమే..!



గుంతకల్లు రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలో ఆర్ఎంఎస్ కార్యాలయం

- రైల్వే మెయిల్ సర్వీస్ తరలింపునకు యత్నం
- గుంతకల్లు నుంచి అనంతపురం, కర్నూలుకు..
- ఇక్కడే కొనసాగించాలని ఉద్యోగులు అభ్యర్థన

6

కలగానే..



- వేతన మెరుగుదల కోసం కష్టజీవుల ఎదురుచూపు
- గత టీడీపీ హయాంలో సలహాబోర్డు ఏర్పాటు
- 2018లో రాష్ట్రమంతటా సలహాబోర్డు పర్యటన
- ప్రభుత్వానికి సిఫార్సులు
- వైసీపీ పాలనలో అటకెక్కించిన వైనం
- కూటమి సర్కారుపై ఆశలు

7

కాపురాల్లో మంటలు

- ఆకర్షణ, ఆర్థిక అవసరాలతో తప్పటడుగులు
- పుట్టుకొస్తున్న అనైతిక బంధాలు
- దంపతుల మధ్య పెరుగుతున్న గొడవలు
- హత్యలు.. ఆత్మహత్యలతో ముగింపు
- ఛిద్రమవుతున్న కుటుంబాలు

- వివరాలు 7లో...



కూలీల కొరత

- ప్రారంభమైన రబీ పంటల సాగు
- కూలీల కోసం పక్క గ్రామాలకు పరుగులు
- ఎకరానికి రూ.4వేల వరకు ఖర్చు
- రవాణా చార్జీల భారం అదనం



కంది పంటలో కలుపుతీస్తున్న కూలీలు

చిలమత్తూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు కొత్త కష్టం వచ్చిపడింది. పంట పెట్టుబడులు ఎక్కడో ఒకచోట అప్పులు తెచ్చి, సమకూర్చుకుంటున్నారు. అష్టకష్టాలు పడి పంటను కాపాడుకుంటున్నారు. కూలీలను తెచ్చుకోవడం మాత్రం తలకు మించిన భారమవుతోంది. కూలీలు దొరకడమే కష్టమవుతోంది. పక్క గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాలు, కర్ణాటకకు కూడా కూలీల కోసం వెళ్లాల్సి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. పంట పెట్టుబడులు పెరిగి, వ్యవసాయం గిట్టుబాటు కాక నష్టపోతున్న రైతులకు కూలీలకు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుండడం మరింత భారమవుతోంది. కూలీలు దొరకట్లేదు. దొరికినా కూలీ రేట్లు విపరీతంగా అడుగుతున్నారు. చేసేదిలేక వారి అడిగినంత రైతులు ఇచ్చుకోవాల్సి వస్తోంది. వారు వచ్చి, వెళ్లేందుకు వాహనాలను సైతం సమకూర్చాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇది మరింత భారంగా మారింది.

పెరిగిన డిమాండ్

ఇటీవల తుపాన్ల ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. దీంతో రబీ పంటల సాగు ఊపందుకుంది. బోరుబావుల ఆధారంగా రైతులు సకాలంలో పంటల సాగుకు తాపత్రయం పడుతున్నారు. ఇప్పటికే పలుచోట్ల మొక్కజొన్న, వేరుశనగ పంటలు సాగు చేశారు. వరినాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఒకేసారి రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించడంతో కూలీల సమస్య తీవ్రమైంది. వ్యవసాయ పనులకు కూలీల డిమాండ్ రోజురోజుకీ పెరిగిపోతోంది. దాంతో సకాలంలో పంటల సాగుకు రైతులు తలలు పట్టుకుంటున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం

రబీలో రైతులు మొక్కజొన్న, వరి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్‌లో మొక్కజొన్న పంట సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. రబీలో కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే పలుచోట్ల విత్తనాలు విత్తుకోగా, మరికొన్నిచోట్ల పొలాలను చదును చేసుకుంటున్నారు. వరి విషయానికి వస్తే బియ్యం ధరలు ఆకాశన్నంటడంతో బోరుబావులు కలిగిన రైతులు ధైర్యం చేసి, వరి సాగుకు పూనుకుంటున్నారు. రోజూ ఆహారంగా తీసుకునే బియ్యం మార్కెట్లో రోజురోజుకీ ధరలు పెరిగిపోతున్న తరుణంలో సొంతంగా ధాన్యం పండించుకోవడానికి సిద్ధపడుతున్నారు.

తీవ్రమైన కూలీల కొరత

రబీలో పంటల సాగుకు కూలీల కొరత తీవ్రంగా ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. మొక్కజొన్న విత్తేందుకు, పంటలో కలుపుతీత పనులకు కూలీలు అవసరం. దీంతో పనులు సకాలంలో చేసుకోలేకపోతున్నామంటున్నారు. పంటలో కలుపుతీతకు ఎద్దులతో దంతెలు పట్టుకోవాలన్నా వాటి ధర కూడా ఎక్కువగానే ఉంటోందంటున్నారు. ఎకరం మొక్కజొన్న పంటలో కలుపు తీయాలంటే 10 నుంచి 15 మంది కూలీలు అవసరమనీ, ఒక్కొక్కరికి రూ.400 నుంచి రూ.500 వరకు ఇచ్చుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. దాంతో కూలీల ఖర్చు రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు పెట్టుబడిలో అదనంగా వచ్చి చేరుతోంది.

పక్కగ్రామాలకు వెళ్లాల్సిందే..

వ్యవసాయ కూలీల కోసం పక్క ఊళ్లకు పరుగులు పెట్టాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. వారిని తీసుకురావడానికి అదనంగా ఆటో చార్జీలు పెట్టుకోవాల్సి వస్తోంది. కిలోమీటరు దూరం ఉంటే కూలీలను తీసుకు రావడానికి రూ.వెయ్యి వరకు, కిలోమీటరు కంటే ఎక్కువగా ఉంటే రూ.1500 నుంచి రూ.1800 వరకు ఆటో చార్జీలు చెల్లించాల్సి వస్తోంది.

పురుష కూలీలు ఏరీ..?

గతంలో పురుషులు వ్యవసాయ పనులకు వెళ్లేవారు. ఇటీవల వ్యవసాయ పనులకు పురుష కూలీలు ఎవ్వరూ రావట్లేదు. కలుపుతీత, వరినాట్లు, పంటకోత వంటి పనులకు మహిళా కూలీలు దొరుకుతున్నారు. పురుషులు మాత్రం దొరకడం కష్టమైంది. దాంతో అరకొరగా వచ్చే పురుష కూలీలు రోజుకి రూ.800 నుంచి రూ.900 వరకు కూలి రేట్లు పెంచేశారు. దాంతో అత్యవసరమైన వ్యవసాయ పనులకు పురుషులు కావాలంటే భారీగా వెచ్చించాల్సి వస్తోంది.

ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసేరా..?

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు ప్రవేశ పెట్టిన ఉపాధి హామీ పథకం వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని రైతులు కోరుతున్నారు. ఉపాధి పనులకు వెళ్లేవారు వ్యవసాయ పనులకు రావడం లేదు. దాంతో వ్యవసాయ పనులకు కూలీల డిమాండ్ బాగా పెరిగింది. ఎంతో కాలంగా ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలంటున్న రైతుల డిమాండ్ నెరవేరేనా అని ఎదురుచూస్తున్నారు. వ్యవసాయానికి అనుసంధానం చేయడం ద్వారా రైతులకు కూలీల సమస్య తీరుతుంది. కూలీలకు ఉపాధి కూడా పుష్కలంగా దొరుకుతుందని అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచన చేసి, వ్యవసాయానికి కూలీల సమస్యను తీర్చాలని రైతులు కోరుకుంటున్నారు.

పురుష కూలీలు దొరకడం లేదు



వరి నాట్లు వేయడానికి పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నాం. దుక్కి చేసుకోవడానికి కూలీలు దొరకడం లేదు. కనీసం గట్లు చెక్కడానికి ఒక పురుష కూలీ కూడా రావట్లేదు. కూలి రేట్లు కూడా భారీగా పెరిగాయి. ఇతర పెట్టుబడుల కంటే కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగాయి. నాట్లు వేయాలంటే వేరే గ్రామం నుంచి కూలీలను తెచ్చుకోవాల్సి వస్తోంది.

- కృష్ణారెడ్డి, రైతు, కోట్లోపల్లి, చిలమత్తూరు మండలం

పెట్టుబడి పెరిగిపోతోంది



కూలీల డిమాండ్ కారణంగా కూలి రేట్లు పెంచేశారు. ఎకరం పంటలో కలుపు తీయించాలంటే రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చు వస్తోంది. కలుపుతీత సకాలంలో చేపట్టకపోతే పంటను నష్టపోవాల్సి వస్తోంది. కూలీల డిమాండ్ కారణంగా సకాలంలో కలుపుతీతకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- నందకుమార్, రైతు, దేమకేతేపల్లి

అహో..



కనువిందు చేస్తున్న సూర్యోదయం

భగభగమండే భాస్కరుడు.. విరజిమ్మిన ఉదయ కాంతులు.. కప్పేసిన మంచు తెరలను చీల్చుకుంటూ.. విచ్చుకుంటుంటే.. ఆకాశం అరుణవర్ణశోభితమై కనువిందు చేస్తే.. అహో.. ఆ దృశ్యం.. అబ్బురం.. అద్భుతం..

తన ప్రతాపంతో ఉక్కిరిబిక్కిరి చేసే భానుడు సూర్యోదయం వేళ అందరినీ అలరించాడు. చిలమత్తూరు మండలం పాతచామలపల్లి సమీపంలో మంగళవారం సూర్యోదయం వేళ ఎర్రటి కాంతులతో ధగధగలాడుతూ కనిపించాడు. చెరువు నుంచి సూర్యోదయం చూస్తూ లుతుంటే సూర్యుడు పలుచోట్ల వివిధ రూపాల్లో కనువిందు చేశాడు.

-హిందూపురం, ఆంధ్రజ్యోతి

రెవెన్యూ సదస్సుల్లో ఉచితంగా 56 సేవలు

కలెక్టర్ చేతన్




వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

లేపాక్షి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో 56 రకాల సేవలను ఉచితంగా పొందవచ్చని కలెక్టర్ చేతన్ సూచించారు. మండలంలోని శిరివరం గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం ఏ ర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సులు రీసర్వే, అడంగల్‌లో మార్పు లు చేర్పులు, సర్వే నంబర్లు తప్పుగా వేయడం, ఆర్ఎస్ రికార్డులు, భూమి కొనుగోలు, విక్రయాలు, పేర్ల మార్పిడి, ఆక్రమణలు, నిషేధిత భూముల జాబితా నుంచి వివరాలు తెలుసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రెవె న్యూ యంత్రాంగమంతా ప్రజల వద్దకు వస్తుందనీ, రికార్డులన్నీ అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలు నేరుగా వినతిపత్రాల ద్వారా రికార్డుల్లో పరిస్థితిని తె లుసుకోవచ్చన్నారు. చెరువులు, కాలువలు, వాటిగట్లపై పట్టాలు పొంది ఉం డుంటే ఖాళీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పెనుకొం డ ఆర్డీఓ ఆనంద్‌కుమార్, ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ సౌజన్యలక్ష్మి పాల్గొన్నారు.

నేడు జిల్లా అభివృద్ధి ప్రణాళిక ప్రదర్శన

పుట్టపర్తి, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో తొలిరోజు జిల్లా అభివృద్ధి ప్రణాళికపై ప్రదర్శన ఇవ్వనున్నారు. జిల్లా కలెక్టర్లతో బుధ, గురువారాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. తొలిరోజు బుధవారం జిల్లాలో విజన్ 2047 ప్రణాళికలతోపాటు వ్యవసాయం, ఉద్యానవనంతోపాటు పశుసంవర్ధక, అనుబంధ రంగాలు, పౌరసరఫరాలు, శాంతిభద్రతలు, ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక, అటవీశాఖ, జలవనరులు, డీఆర్‌డీఏ, డ్వామా, మోప్మా, శాంతిభద్రతలు పలు శాఖలపై సమీక్ష చేస్తారు. రెండోరోజు గురువారం పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, పర్యాటకం, ఇంధనం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, హౌసింగ్, ఆరోగ్యం, సంక్షేమ హాస్టళ్లు, ఐసీడీఎస్, కార్మిక, రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, గనులు, పేదరిక నిర్మూలన, ఉద్యోగ కల్పన, మానవ వనరుల అభివృద్ధి, జిల్లా అభివృద్ధి ప్రణాళిక ప్రదర్శన ఇలా 36 పథకాలపై ప్రజెంటేషన్ నిర్వహిస్తారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ల పనితీరు చర్చకు వచ్చే అవకాశం ఉంది. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ టీఎస్ చేతన్.. జిల్లా ప్రగతిపై నివేదికతోపాటు సమీక్ష ఇవ్వనున్నారు.



గండిచెరువు మరువ నుంచి వృథాగా పోతున్న నీరు

అన్నదాత ఆశలకు గండి

గాండ్లపెంట, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): చెరువు నిండుతోందే తప్ప.. అన్నదాతకు ఆనందం లేదు. ఉపయోగం లేదు. పొలాలకు దారి కావాలంటూ చెరువు నీటిని వృథాగా వదిలేస్తున్నారు. దీంతో ఆయకట్టు రైతుల ఆశలపై నీళ్లు చల్లుతున్నారు. ఏళ్లుగా ఇదే తంతు సాగుతోంది. పొలాలకు దారి నిర్మించి, నీటి వృథాను అరికట్టే దిశగా అధికారులు చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. ఆయకట్టు గురించి ఆలోచించే నాథుడే లేడని అన్నదాతలు వాపోతున్నారు. దీంతో చెరువు నిర్మించిన ఉద్దేశమే నీరుగారిపోతోంది. మండలంలోని వేపులకుంట గ్రామ పరిధిలోని గండి చెరువు దుస్థితి ఇది.

ప్రతినీటి చుక్కను వృథాకాకుండా చూడాలన్నది ప్రభుత్వం ఉద్దేశం. దానికి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. మండలంలోని గండి చెరువుకు పదేళ్ల క్రితం మరమ్మత్తులు చేశారు. గండిచెరువు అటువైపు భూములకు రస్తా, ముంపు భూముల రైతులకు ఇంతవరకు పరిహారం అందలేదు. 2019లో భారీ వర్షాల కారణంగా వేపలకుంట గ్రామంలోకి నీరు చేరింది. అప్పటిలో అటువైపు భూములకు దారిలేక పోవడంతో నీటి పారుదల శాఖాధికారులు చెరువు మరువను కొంత భాగం తొలగించారు. మూడు అడుగుల మేర మరువను ధ్వంసం చేశారు. చెరువు అటువైపు భూములకు అంతంతమాత్రంగా రస్తా ఏర్పడింది. నాలుగేళ్లుగా వర్షాలకు చెరువులోని నీరు చేరుతోంది. మరువను తొలగించడంతో ఆ నీరంగా వృథాగా పోతోంది. చెరువు అటువైపు భూములకు రస్తా సౌకర్యం కల్పించలేదు. ఈ ఏడాది కూడా చెరువులోకి నీరు చేరింది. అదంతా వృథాగా పోతోంది. దీంతో వేసవిలో సాగు, తాగునీటి సమస్య తలెత్తుతుందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా చెరువు అటువైపు భూములకు రస్తా కల్పించి, ముంపు రైతులకు పరిహారం అందించి, మరువను మూసివేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక మూటలు వేసి.. నీరు నిలుపుకోవచ్చు

గతంలో అధిక వర్షాలతో గండిచెరువు నిండిపోయింది. చెరువుకు అటువైపు భూముల్లో సాగుచేసిన పంటలను తీసుకురావడానికి రహదారి లేకపోవడంతో కొంతమేర చెరువు మరువను రైతులు తొలగించారు. ఇప్పుడు నీరు కావాల్సిన రైతులు ఇసుక మూటలు వేసుకుని, నిలుపుకోవచ్చు. చెరువు అటువైపు భూములకు దారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం.

-అరుణ, ఇరిగేషన్ జేఈ

పాగా వేసేదెవరో..?

- మార్కెట్ యార్డుల పాలకవర్గాల నియామకానికి కసరత్తు
- రిజర్వేషన్ల ఖరారుకు యంత్రాంగం కసరత్తు
- కూటమి పార్టీల ఆశావహుల్లో టెన్షన్



హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డు

పుట్టపర్తి, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడిచిపోయాయి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్లు, అర్బన్ అథారిటీ సంస్థలకు చైర్మన్, సభ్యులను నియమించారు. తాజాగా జిల్లాలో మార్కెట్ యార్డుల పాలకవర్గాల నియామకానికి ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. జిల్లా యూనిట్‌గా రొటేషన్ ప్రాతిపదికన మార్కెట్ కమిటీల చైర్మన్, సభ్యుల రిజర్వేషన్ ఖరారు చేయాలని ప్రభుత్వం నుంచి జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మార్కెట్ యార్డు కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు, బీసీ, మహిళ, జనరల్ కేటగిరీలతోపాటు అన్ని వర్గాలు ఉండేలా రిజర్వేషన్ నిర్ధారించాలని నిర్ణయించారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా మార్కెట్ యార్డుల సమగ్ర వివరాలతో మార్కెటింగ్ శాఖ.. కలెక్టర్‌కు నివేదికలు పంపింది. ఈనేపథ్యంలో జిల్లాలో నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న వారిలో టెన్షన్ నెలకొంది. కనీసం మార్కెట్ కమిటీల్లోనైనా అవకాశం దక్కకపోతుందా అని ఎదురు చూస్తున్నారు. పాలకవర్గం నియామకంపై కసరత్తు చేస్తున్న తరుణంలో ఏ మార్కెట్ యార్డు చైర్మన్ గిరీపై ఎవరికి రిజర్వేషన్ దక్కుతుందోనన్న టెన్షన్ మొదలైంది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఈ ప్రక్రియ పూర్తి చేసి, రెండుమూడు రోజుల్లో రిజర్వేషన్ను ప్రకటించే అవకాశం ఉందని మార్కెటింగ్ శాఖ భావిస్తోంది.

మార్కెట్ పీఠం ఎవరికో..?

జిల్లాలో ఎనిమిది మార్కెట్ యార్డులున్నాయి. అన్నిచోట్లా చైర్మన్ పదవి కోసం తీవ్రపోటీ నెలకొంది. ఆయా నియోజక వర్గాల్లో కూటమి పార్టీల్లో పలువురు చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. ప్రధానంగా ఆర్థిక వనరులున్న హిందూపురం, గోరంట్ల, పుట్టపర్తి, కదిరి మార్కెట్ యార్డుల చైర్మన్ పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంది. ధర్మవరం, పెనుకొండ, మడకశిర, తనకల్లు మార్కెట్ యార్డులకు కూడా పోటీ తక్కువేం లేదు. టీడీపీ నుంచే ఆశావహులు అత్యధికంగా ఉండగా.. జనసైనికులతోపాటు బీజేపీ నుంచి తమకు ఒకట్రెండు చోట్ల అవకాశం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇప్పటివరకు రాష్ట్రస్థాయిలో పలు కార్పొరేషన్లు, తుడా, పుడా, అహుడా చైర్మన్, సభ్యుల ఎంపిక విషయంలో కూటమిలో క్రియాశీలకంగా పనిచేసిన వారికే ప్రాధాన్యమిచ్చారు. ఈనేపథ్యంలో మార్కెట్ యార్డుల పాలకవర్గాల నియామకంలోనూ కూటమి అధినాయకత్వం అదే పంథాను అనుసరిస్తోందని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు భావిస్తున్నారు. రెండేళ్లపాటు రొటేషన్ ప్రాతిపదికన రిజర్వేషన్ ఖరారు చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆశావహులు ఎవరిస్థాయిలో వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పదవులు ఎవరిని వరిస్తాయో.. వేచిచూడాలి.



పాముతో ఆట్లాడుతున్న మందుబాబు

కిక్కులో తిక్క పని

నాగుపాముతో మందుబాబు ఆటలు..!

అనంతపురం నగర శివారుల్లోని టీవీ టవర్ సమీపంలో ఓ మందుబాబు నాగుపాముతో ఆటలాడుతూ హల్‌చల్ చేశాడు. కదిరి-అనంతపురం హైవే పక్కన కూర్చొని పామును చేతిలో పట్టుకోవడం స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. పాము పడగ విప్పగా చేత్తో అటూ ఇటూ ఆడిస్తూ పట్టుకున్నాడు. మెడలో వేసుకుని అటూ ఇటూ తిరిగాడు. దగ్గరకు వస్తే పాము విసిరేస్తానంటూ స్థానికులను భయపెట్టాడు. అయినా ఆ పాము ఇతడిని కాటు వేయకపోవడం గమనార్హం. ఇంతలో కొంత మంది మందుబాబును మందలించి పామును సమీపంలోని చెట్లపొదల్లోకి విడిచి పెట్టేలా చేయించారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురంరూరల్

మధ్యాహ్న భోజనం సూపర్

రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం మంచి నాణ్యతతో ఉందని రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి ప్రశంసించారు. ఆయన మంగళవారం తాడిపత్రి, మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను తనిఖీ చేశారు. స్థానిక ట్రిబుల్‌ఎస్ ఎంఆర్‌ఎంలో మధ్యాహ్న భోజనంలోని అన్నం, పప్పు, రసం, చిత్రాన్నం, పులిహోర, పెరుగన్నం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం తిన్నారు. అనంతరం నాణ్యత తదితర అంశాలపై ఆరాతీశారు. ఇంత నాణ్యమైన భోజనాన్ని మెను ప్రకారం ఇవ్వడం చాలా గ్రేట్ అని కితాబిచ్చారు. మధ్యాహ్నభోజనాన్ని ఎవరు చేయిస్తున్నారని ఆరాతీయగా ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శైలజాసేవాట్రస్ట్ నిర్వాహకుడు అరవింద నారాయణరెడ్డి ఆధ్వర్యంలో భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఇంత నాణ్యమైన భోజనం రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు. అనంతరం అరవింద నారాయణరెడ్డి ఇంటివద్దకు వెళ్లి ముందు ముందు కూడా ఇలాగే చేయాలని ప్రోత్సహించారు. అనంతరం ఆయనకు శాలువాకప్పి సన్మానించారు. అంతకుముందు జయనగర్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న జూటూరుకాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని, చుక్కలూరు అంగన్‌వాడీ కేంద్రాల తోపాటు చుక్కలూరు హైస్కూల్‌ను తనిఖీచేసి భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ నాగరాజు, సివిల్‌సప్లై అధికారి మారుతీప్రసాద్‌రెడ్డి, సీడీపీఓ సాజిదాబేగం, సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



చిత్రాన్నం తింటున్న ఫుడ్ కమిటీ చైర్మన్

ఇక గతమే...!

రైల్వే మెయిల్ సర్వీస్ తరలింపునకు యత్నం



డివిజనల్ ఆర్‌ఎంఎస్ ప్రధాన కార్యాలయం

ఆమరణ దీక్షకు సిద్ధం



బ్రిటిష్ పాలనా కాలం నుంచి గుంతకల్లులో ఆర్‌ఎంఎస్ సేవలందిస్తోంది. అలాంటి ఆర్‌ఎంఎస్‌ను ఇతర ప్రాంతాలకు తరలించడం అన్యాయం. పార్శిల్, స్పీడ్, రిజిస్టర్ వేరు వేరు కంపెనీలా తయారు చేయాలని ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తోంది. ఆర్‌ఎంఎస్‌ను ఇక్కడే కొనసాగించాలి లేదంటే ఆమరణ దీక్ష చేస్తాం.

-నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత దేశంలో అతి పెద్ద రైల్వే మెయిల్ సర్వీస్(ఆర్‌ఎంఎస్)కార్యాలయాన్ని గుంతకల్లు నుంచి తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. రైళ్ల ద్వారా పార్శిళ్లు, ఉత్తరాలను ఇతర ప్రాంతాలకు చేరవేయడానికి గుంతకల్లులో 1960లో రైల్వే మెయిల్‌సర్వీసు కార్యాలయం ఏర్పాటు చేశారు. అరవై ఏళ్ల పైబడిన చరిత్ర ఉన్న గుంతకల్లు రైల్వే మెయిల్ సర్వీస్‌ను అనంతపురం, కర్నూలుకు తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గుంతకల్లు నుంచి స్పీడ్, రిజిస్టర్, ఆన్‌రిజిస్టర్, బిజినెస్, వార పత్రికలు, మ్యాగ్‌జైన్‌లను ముంబై, బెంగళూరు, చెన్నై రాష్ట్రాలకు పంపేవారు. కేవలం స్పీడ్ పోస్టు సాకుగా చూపి ఇక్కడ ఉన్న సర్వీస్ కార్యాలయాన్ని తరలించేందుకు యత్నిస్తున్నారు. గతంలో రోజు వందమంది సిబ్బంది పనిచేసేవారు. పని ఎక్కువగా ఉన్న, స్థలంలో లేకున్న రైల్వే ప్లాట్‌ఫాంలోనే ఉత్తరాలు పెట్టుకుని పనిచేసేవారు. మోదీనబాదులో 8 ఎకరాల స్థలంలో రైల్వే మెయిల్ సర్వీసు కార్యాలయం, క్వార్టర్స్‌లు ఉన్నాయి. మరిన్ని భవనాలు నిర్మించుకునేందుకు ఖాళీ స్థలం ఉంది. వంద మంది రెగ్యులర్, వంద మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. కార్యాలయం ఇతరప్రాంతాలకు తరలిస్తే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఉద్యోగులు వాపోతున్నారు. ఇక్కడే స్పీడ్ పోస్టు సౌకర్యం కల్పిస్తే సర్వీస్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఉద్యోగులు చెబుతున్నారు.

గుంతకల్లు నుంచి అనంతపురం, కర్నూలుకు..

ఇక్కడే కొనసాగించాలని ఉద్యోగులు అభ్యర్థన



గుంతకల్లు రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫాంలో ఆర్‌ఎంఎస్ కార్యాలయం

పోస్టల్ స్టోర్ డిపో మూసివేత

పట్టణంలోని పాత ఐటీసీ డిపో వద్ద ఉన్న పోస్టల్ స్టోర్ డిపో ద్వారా రాయలసీమ పరిధిలో అన్ని పోస్టాఫీసులకు స్టేషనరీ సప్లై చేసేవారు. జూన్ 1, 2021లో స్టోర్ డిపోను మూసివేశారు. ప్రస్తుతం విజయవాడ నుంచి స్టేషనరీ సరఫరా చేస్తున్నారు. అలాగే పదేళ్ల కిందట సూపరింటెండెంట్ కార్యాలయం మూసివేశారు. ప్రస్తుతం స్పీడ్ పోస్టులో విలీనం చేసి రైల్వే మెయిల్ సర్వీస్ కార్యాలయాన్ని మూసివేసేందుకు రంగం సిద్ధం చేశారు.

ఆర్‌ఎంఎస్‌ను అభివృద్ధి చేస్తాం

ఆర్‌ఎంఎస్ బలాన్ని గుర్తించకుం డా, బలహీతను గుర్తించి ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదు. గుంతకల్లులో ఎంతో చరిత్ర కలిగిన ఆర్‌ఎంఎస్‌కు చరమగీతం పాడడానికి పూనుకోవడం దారుణం. ఇతరప్రాంతాలకు తరలిస్తే మా కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఆర్‌ఎంఎస్‌ను ఇక్కడే కొనసాగిస్తే మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తాం.



- ప్రవల్లిక, ఆర్‌ఎంఎస్ ఉద్యోగి

నాకేం తెలియదు

- అగ్రిగోల్డ్ భూముల విషయంపై తహసీల్దార్
- ఆస్తులను 'దున్నేస్తున్న' వైసీపీ నాయకుడు
- కార్యాలయంలో ఓ అధికారితో డీల్

పుట్లూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు- చెర్లోపల్లి గ్రామాల మధ్యనున్న అగ్రిగోల్డ్ భూముల విషయం గురించి తనకు ఏమి తెలియదని తహసీల్దార్ శేషారెడ్డి మంగళవారం ఫోన్‌లో వివరణ ఇచ్చారు. అగ్రిగోల్డ్ విషయమా? నాకు ఏమి తెలియదు. ఆఫీసులో ఎవరు చూసుకుంటున్నారో కూడా తెలియదని సమాధానం ఇచ్చారు. ఆ గ్రామంలో వందల ఎకరాల్లో భూములు ఉన్నట్లు తన దృష్టికి రాలేదన్నారు. ఆ భూములను సీజ్ చేసినట్లు కూడా తనకు తెలియదని ఆయన పలువురు వీఆర్వోల వద్ద ఆవేదన వెల్లగక్కినట్లు తెలిసింది. మండలానికి కొత్తగా వచ్చానని అలాంటి విషయాలు నాకు ఎలా తెలుస్తాయంటూ చెప్పారు. మండలంలో కడవకల్లు గ్రామంలో ఓ వైసీపీ నాయకుడు వంద ఎకరాలకు పైగా ఆక్రమించుకుని సాగు చేస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నాడన్న విషయం తెలిసిందే. ఇదంతా తెలిసిన అధికారులు ఇప్పటివరకు ఏమీ పట్టించుకోకపోవ డంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



రూ.20లక్షల పరికరాలు మాయం

అగ్రిగోల్డ్ భూముల్లో ఉపయోగించిన యంత్రాలు, పరికరాలు తదితర సామగ్రి విలువ రూ.20లక్షలకు పైనే ఉంటుందని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు. రెండు ట్రాక్టర్లు, వందలాది మీటర్ల డ్రిప్పు వైర్లు, వేలాది మీటర్ల కంచె తదితర సామగ్రిని సైతం ఆ వైసీపీ నాయకుడే సుమారు రూ.20లక్షలకు పైగానే అమ్ముకున్నట్లు సమాచారం. వీటితో పాటు వంద ఎకరాల్లోపు అరటి, మొక్కజొన్న, దానిమ్మ తదితర పంటలు సాగుచేసుకుంటూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నాడన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. అగ్రిగోల్డ్‌లో ఉన్న లక్షలాది రూపాయల భవంతులను సైతం ఆ వైసీపీ నాయకుడు లీజుకు ఇచ్చుకుంటూ లబ్ధి పొందుతున్నాడు. ఇదంతా తెలిసిన రెవెన్యూ అధికారులు మాకెందుకులే ఆ నాయకుడి గురించి అంటూ కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.



అగ్రిగోల్డ్ భూమి ప్రధాన ముఖద్వారం

అధికారులకు వాటా ముట్టిందా?

అగ్రిగోల్డ్ భూముల విషయంలో ఆ వైసీపీ నాయకుడు అధికారులకు వాటా ముట్టచెప్పాడన్న ఆరోపణలు కడవకల్లు గ్రామంలో వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు కనీసం ఆ ప్రాంతాన్ని ఏ ఒక్క అధికారి తనిఖీచేసిన పాపాన పోలేదు. ఆ వైసీపీ నాయకుడు నేరుగా పుట్లూరులోని తహసీల్దార్ కార్యాలయంలోని ఓ అధికారి దగ్గరకు వెళ్లి నేరుగా డీల్ చేశాడన్న విమర్శలు ఉన్నాయి. తనకు టీడీపీ నాయకుల అండ ఉంది ఎవరు ఏమిచేయలేరు అంటూ పలువురు వీఆర్వోల దగ్గర చెబుతున్నట్లు తెలిసింది. తహసీల్దార్ కార్యాలయంలోని ఓ అధికారికి పెద్దమొత్తంలో ఆమ్యామ్యాలు ముట్టచెప్పినట్లు సమాచారం.

సంక్రాంతికి పనులు పూర్తి కావాలి

ప్రతి హాస్టల్‌లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

సంక్షేమ శాఖల అధికారులకు కలెక్టరు ఆదేశం



అనంతపురం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల నిర్మాణాలు, మరమ్మతు పనులు సంక్రాంతి పండుగలోగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వసతిగృహాల ప్రగతి పనులపై మంగళవారం ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని 11 హాస్టళ్లకు డిస్ట్రిక్ జనరల్ ఫండ్ కింద రూ1.12కోట్లు ఇచ్చామన్నారు. ఇప్పటికే 10హాస్టళ్లలో పనులు పూర్తి చేశారని మిగిలిన ఒక్కహాస్టల్లోనూ పనులు త్వరగా ముగించాలన్నారు. మరోవైపు ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన రూ.5.70కోట్లతో 36 హాస్టళ్లకు సంబంధించిన పనులు చేపట్టాల్సి ఉందని వెల్లడించారు. ఈపనులన్నీ ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టరు ఆదేశించారు. ప్రతి వసతిగృహంలోను తప్పనిసరిగా సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏపీఈడబ్ల్యుఐడీసీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ఈపనులన్నీ పూర్తి చేయించాలన్నారు. అన్ని వసతిగృహాలలో రెండురోజుల్లోగా ట్యూటర్లను నియమించుకోవాలన్నారు. సంక్రాంతి పండుగలోగా పనులన్నీ పూర్తి చేసి ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి ప్రారంభోత్సవాలు చేపట్టాలని కలెక్టరు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఈపనుల విషయంలో ఎవరు ఎక్కడ నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని కలెక్టరు హెచ్చరించారు. కార్యక్రమంలో సోషల్‌వెల్ఫేర్ డీడీ ప్రతాప్ ఎసూర్యనారాయణరెడ్డి, ఉపాధి కల్పనాధికారి కళ్యాణి, మైనార్టీ వెల్ఫేర్ అధికారి రామసుబ్బారెడ్డి పలువురు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



యాడికిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఫీల్డ్‌లోకి తమ్ముళ్లు..?

ఫీల్డ్ అసిస్టెంట్‌ల నియామకంలో టీడీపీ నాయకుల దందా

ప్రాంతాన్ని బట్టి రేటు నిర్ణయం

యాడికి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలో కొందరు టీడీపీ నాయకులు దందా చేసినట్లు చర్చ జరుగుతోంది. కొన్ని పంచాయతీల్లో వైసీపీ పాలన నుంచి పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఇప్పటికీ అలాగే పని చేస్తున్నారు. వారిని తొలగించి టీడీపీ వర్గీయులను నియమించుకోవాలని టీడీపీ నాయకులు పట్టుబడుతున్నారు. ఇదే అదనుగా కొందరు నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంపై దందా మొదలుపెట్టినట్లు చర్చ జరుగుతోంది. మా గ్రామపంచాయతీలో మాకు తెలియకుండా మీరెలా పేర్లను ప్రతిపాదిస్తారు? పైగా పోస్టులను మీరు అమ్ముకొని సొమ్ము చేసుకుంటారా అని గ్రామాల్లోని నాయకులు ఆగ్రహంతో ఉన్నారు.

చేతులు మారుతున్న లక్షలు..?

చిక్కేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించి, కొత్తగా టీడీపీలోకి వచ్చిన, వైసీపీకి అనుకూలంగా ఉన్న వ్యక్తిని ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించారంటూ సీనియర్ టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంలో రూ2.5లక్షలు చేతులు మారినట్లు చర్చించుకుంటున్నారు. ప్రాంతాన్ని బట్టి రేటు నిర్ణయిస్తున్నట్లు సమాచారం. కమలపాడు గ్రామ పంచాయతీకి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ నియామకానికి రూ.4లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిట్టూరు గ్రామ పంచాయతీకి సంబంధించి ప్రస్తుతం ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా చేయాలని, వేతనాలు పెట్టకుండా అధికారులచే టీడీపీ నాయకులు వేధిస్తున్నట్లు ఉపాధిహామీ సిబ్బంది చర్చించుకుంటున్నారు. యాడికిలో ప్రస్తుతం పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను కూడా నువ్వు రాజీనామా చేయాలి మావాళ్లను ఎక్కించుకుంటామని హెచ్చరించినట్లు తెలుస్తోంది. అతను రాజీనామా చేయకపోయేసరికి అధికారులతో నోటీసులు ఇప్పించారని, దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్ హైకోర్టుకు వెళ్లినట్లు తెలిసింది. దీనికి సంబంధించి ఎంపీడీఓకు హైకోర్టు నుంచి నోటీసులు వచ్చినట్లు సమాచారం. 'నాయకులు బలవంతంగా చేయిస్తున్న పనికి కోర్టుకు తాము వివరణలు ఇచ్చుకోవాల్సి వస్తోంది. ఇదేమి మండలమో ఏమో' అని అధికారులు చిరుబుర్రులాడుతున్నారు. కొందరు టీడీపీ నాయకులు చేస్తున్న పనికి ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు వస్తున్నట్లు మండలవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. కొత్తగా వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బోగస్ మస్టర్లు తయారు చేసేలా కొందరు టీడీపీ నాయకులు ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. లారీ డ్రైవర్లను ఉపాధి కూలీలుగా నమోదుచేసి పనులకు రాకపోయినా లబ్ధి చేకూరేలా చేస్తున్నా రని ఇలాంటి పేర్లు ఇప్పటికే వందల సంఖ్యలో నమోదు చేయించారని ఉపాధి హామీ సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు, నియామకం వ్యవహారంపై ఉపాధిహామీ పథకం ఏపీఓ రమేష్‌ను వివరణ కోరగా ఇందులో తనకేమి సంబంధం లేదని, ఇదంతా ఎంపీడీఓ పరిధిలోనే ఉంటుందని తెలిపారు.



వ్యవసాయ మార్కెట్ పాలకుల కోసం

కసరత్తు..!

అనంతపురంరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే కార్పొరేషన్లకు సంబంధించిన నామినేటెడ్ పోస్టులు ఒక్కొక్కటిగా భర్తీ చేస్తున్నారు. ఈక్రమంలోనే మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఆ మేరకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులకు ఇటీవల ఆదేశాలు అందాయి. ఈ క్రమంలోనే శాఖ ఉన్నతాధికారుల నుంచి జిల్లాలోని మార్కెటింగ్ శాఖ అధికారులకు కమిటీ ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలు, రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తిగా చేపట్టాలని సూచనలు జారీ చేసినట్లు సమాచారం. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత జిల్లాలోని 9మార్కెట్ కమిటీల రిజర్వేషన్లను ప్రభుత్వానికి అధికారులు నివేదించనున్నారు. ఆతరువాత కమిటీలు ఏర్పాటయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఆలస్యంగా గుంతకల్లు-బోధన్ రైలు



గుంతకల్లు, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లో జరుగుతున్న మెయింటెనెన్స్ పనుల కారణంగా గుంతకల్లు-బోధన్ (నం. 07671) ప్యాసింజరు ప్రత్యేక రైలును ఆలస్యంగా నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11, 18, 25 తేదీల్లో ఈ రైలును మూడు గంటలపాటు ఆలస్యంగా నడపనున్నట్లు తెలియజేశారు.



అర్హులందరికీ ఇళ్లు

జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ శైలజ



అనంతపురం సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అర్హులైన పేదలందరికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై)-2 కింద ఇళ్లు మంజూరు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని జిల్లా గృహ నిర్మాణశాఖ ఇన్‌చార్జి పీడీ శైలజ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అర్హులను గుర్తించేందుకు డిమాండ్ సర్వేను చేస్తున్నామన్నారు.

● **ప్రశ్న: ప్రభుత్వ ఇల్లు కావాలంటే అర్హతలు ఏవి..?**

జవాబు: ఇల్లు కావాల్సిన వారికి స్థలం పట్టా, డాక్యుమెంట్స్, నివాస ధ్రువీకరణ పత్రాలు ఏవైనా ఒకటి ఉండాలి. వీటితో పాటు తెల్లరేషన్ కార్డు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, ఎన్‌పీసీఐ లింక్ కలిగిన ఏదైనా అకౌంట్‌తో పాటు ఏడాదికి వారి కుటుంబ ఆదాయం రూ. 3లక్షలులోపు ఉండాలి. గతంలో ప్రభుత్వ పథకం కింద ఇల్లు పొంది ఉండరాదు.

● **డిమాండ్ సర్వే ఎలా చేస్తారు..?**

జవాబు : ప్రభుత్వం వద్ద ఉన్న డేటా ప్రకారం ఒక యాప్ ద్వారా డిమాండ్ సర్వే చేసి అర్హులను గుర్తించమని ఆదేశాలు జారీ చేసింది. దీంతో గ్రామ స్థాయిలో హౌసింగ్ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, పట్టణ ప్రాంతాల్లో వార్డు ఎమినిటీస్ ద్వారా ఇంటింటా డిమాండ్ సర్వే చేసి యాప్‌లో దరఖాస్తుదారుల వివరాలను అప్‌లోడ్ చేస్తే వారు అర్హులా..? కాదా..? అనే విషయం అక్కడికక్కడే తెలిసిపోతుంది.

● **ప్రశ్న: స్థలం ఉన్నవారికేనా ఇల్లు..?**

జవాబు: ప్రస్తుతానికి ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం సొంత స్థలం కలిగిన వారి జాబితా మాత్రమే గుర్తించి అర్హులను ఎంపిక చేయమని ప్రభుత్వం ఆదేశించింది. ఆ దిశగా సర్వే చేస్తాం. స్థలంతో ఇల్లు మంజూరు విషయంపై ప్రభుత్వం ఇంకా ఆదేశాలు జారీ చేయలేదు.

ప్రశ్న: ఈ సర్వే ఎప్పటి నుంచి ప్రారంభమైంది..?

జవాబు: గత పది రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా సర్వే ప్రారంభించాం. నెలాఖరు వరకు ఈప్రక్రియ కొనసాగుతుంది. తరువాత అర్హులైన వారందరికి వచ్చే మార్చి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలయ్యే పీఎంఏవై-2 పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేస్తాం.

నానాటికీ తీసికట్టు..!

- కూలుతున్న హెచ్చెల్సీ వంతెనలు
- ఆధునికీకరణ పట్టని ప్రభుత్వాలు
- ఆందోళన చెందుతున్న రైతన్నలు



కణేకల్లు వద్ద కూలిన హెచ్చెల్సీ కల్వర్టు

కణేకల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో హెచ్చెల్సీ పరిస్థితి నానాటికి దిగజారుతోంది. కాలువకు అనుబంధంగా ఉన్న అనేక వంతెనలు, కల్వర్టులు కుప్పకూలుతున్నాయి. దీంతో రానున్న కాలంలో హెచ్చెల్సీ పరిస్థితిపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



నాగేపల్లి వద్ద కూలిన హెచ్చెల్సీ కల్వర్టు

కూలిన ఐదు వంతెనలు

గత రెండేళ్ల నుంచి హెచ్చెల్సీపై ఐదు కల్వర్టులు కుప్పకూలాయి. అందులో 165 కి.మీ. వద్ద ఉన్న బిదురకుంతం కల్వర్టు, 171 కి.మీ. వద్ద ఉన్న హోన్నూరు కల్వర్టు, 113 కి.మీ. వద్ద ఉన్న నాగలాపురం వంతెనతో పాటు 147 కి.మీ. వద్ద ఉన్న కణేకల్లులో శ్రీచిక్కణ్ణేశ్వర చెరువు వద్ద ఉన్న వంతెన, 155 కి.మీ. వద్ద ఉన్న నాగేపల్లి వంతెన ఉన్నాయి. ఇవి కూలిపోవడంతో ఆయా గ్రామాల రైతులు పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కూలేందుకు సిద్ధం

మాల్యం వద్ద ఉన్న ప్రధాన హెచ్చెల్సీ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలుతుందోనన్న పరిస్థితి ఏర్పడింది. అనేక ఏళ్లుగా ఈ బ్రిడ్జి గురించి పాలకులకు, అధికారులకు ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా నిధులు లేవన్న కారణంతో మరమ్మతులు చేయలేదు. హెచ్చెల్సీ అక్విడెక్ట్ పరిస్థితి కూడా ఇబ్బంది కరంగా మారింది. అక్విడెక్ట్‌లోని పలు ప్రాంతాల నుంచి రాళ్లు పోవడంతో పెద్ద పెద్ద లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా బయటకు వెళ్తోంది. దీంతో ఇప్పటికే అధికారులు అక్విడెక్ట్‌పై రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు.

పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వం హెచ్చెల్సీని నిర్లక్ష్యం చేసింది. మరమ్మతులకు ఒక్క పైసా కూడా విదల్చకపోవడంతో రైతులే దర్గాహోన్నూరు వద్ద కూలిన వంతెనను చందాలు వేసుకుని బాగు చేసుకున్నారు. మరమ్మతు పనుల కోసం అధికారులు గత ఐదేళ్లలో పలుసార్లు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం వాటిని బుట్టదాఖలు చేసింది. 12 ఏళ్ల క్రితం ఆధునికీకరణ పనుల కోసం నాటి ప్రభుత్వం విడుదల చేసిన రూ.310 కోట్ల నిధులు తప్ప మరలా ఎలాంటి నిధులు రాకపోవడంతో హెచ్చెల్సీ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులపై శ్రద్ధ చూపి నిధులు మంజూరు చేయడంతో పాటు అత్యవసరంగా చేయాల్సిన మరమ్మతులను చేయించాలని రైతులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మాల్యం బ్రిడ్జి



మాల్యం వద్ద ఉన్న హెచ్చెల్సీ ప్రమాదకరంగా ఉంది. బ్రిడ్జికు సంబంధించిన పిల్లర్ల రాళ్లన్నీ ఊడి పోయాయి. ఈ బ్రిడ్జిపైనే కణేకల్లు నుండి ఉరవకొండతో పాటు అనేక గ్రామాలకు వెళ్లే బస్సులు, ఇతరత్రా వాహనాలు ప్రయాణించాల్సి ఉంది. అనుకోని సంఘటనలు జరిగితే భారీగా ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది.

- గురుస్వామి, రైతు, మాల్యం

రూ.36 కోట్లకు ప్రతిపాదనలు: మద్దిలేటి, హెచ్చెల్సీ డీఈ



హెచ్చెల్సీ సబ్ డివిజన్ పరిధిలో అత్యవసర పనుల కోసం రూ. 36 కోట్లకు ప్రతిపాదనలు పెట్టాం. ఇందులో నాగలాపురం, నాగేపల్లి, హోన్నూరు, గెణిగెరతో పాటు ఆరు వంతెనలు, నాలుగు ఎస్కేప్ రెగ్యులేటర్లు ఉన్నాయి. ఇప్పటికే ఆధునికీకరణ పనులలో ఈ వంతెనలకు సంబంధించి పిల్లర్లు సిద్ధంగా ఉన్నాయి. వాటిపై మిగతా పనులు పూర్తి చేస్తే అవి అందుబాటులోకి రానున్నాయి. నిధులు మంజూరై కాలువలో నీటి ప్రవాహం తగ్గిన వెంటనే పనులు చేసేందుకు ఆస్కారం ఉంటుంది. అలాగే ఆధునికీకరణలో భాగంగా చేసి వదిలేసిన మిగతా పనులను పూర్తి చేయాలంటే దాదాపు 600 కోట్లు అవసరమవుతుంది.

కలగానే..
కనీస వేతనం

వేతన మెరుగుదల కోసం
కష్టజీవుల ఎదురుచూపు
గత టీడీపీ హయాంలో సలహాబోర్డు ఏర్పాటు
2018లో రాష్ట్రమంతటా పర్యటన
ప్రభుత్వానికి సిఫార్సులు
వైసీపీ పాలనలో అటకెక్కించిన వైనం
కూటమి సర్కారుపై ఆశలు

ధర్మవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కష్టజీవులకు కనీస వేతనం కలగానే మిగిలిపోతోంది. కష్టానికి తగ్గ వేతనం దక్కక శ్రమ దోపిడీ బారిన పడుతున్నారు. 2010లో నిర్ణయించిన కనీస వేతనాలే కష్టజీవులు, అసంఘటిత రంగ కార్మికులకు నేటికీ అమలవుతున్నాయి. 2017కి ముందే జరగాల్సిన కనీస వేతన సవరణ నేటికీ అమలుకు నోచుకోవట్లేదు. ఈ ఏడున్నరేళ్లలో నిత్యావసర సరుకులు, సేవల ధరలు 200 శాతానికి పైగా పెరిగాయి. ఫలితంగా కార్మికుల జీవన వ్యయం అనేక రెట్లు పెరిగింది. అయినా కార్మికుల వేతనాలు మాత్రం పెంపునకు నోచుకోలేదు. 2014 తరువాత కనీస వేతన సవరణలేకపోవడంతో కార్మికులు ఆందోళన చేపట్టారు. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం 2018లో వేతన సవరణపై కసరత్తు ప్రారంభించింది. పెరుగుతున్న ధరలు, జీవన ప్రమాణాల ఆధారంగా వేతన సవరణకు సంబంధించి నివేదికను సిద్ధం చేయాలని సలహా మండలిని ఆదేశించింది. ఆ సలహా మండలి చైర్మన్ రామ్మోహన్‌రావు నేతృత్వంలోని బృందం రాష్ట్రవ్యాప్తంగా పర్యటించింది. కార్మికులు, సంఘాలతో సమావేశాలు నిర్వహించింది. కనీస వేతనాన్ని రూ.21వేలకు పెంచాలని కార్మిక సంఘాలు


ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

ముక్తకంఠంతో నినదించాయి. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్లను నమోదుచేసి, సలహా సంఘం వేతన సవరణపై నివేదికను సిద్ధం చేసింది. సరిగ్గా అదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. 2019 ఎన్నికల్లో నెగ్గిన వైసీపీ అధికారం చేపట్టాక కనీస వేతన సవరణను అటకెక్కించింది. కనీస వేతన సలహాబోర్డు నివేదికను బుట్టదాఖలు చేసింది. ఐదేళ్లు ఆ ఊసే ఎత్తలేదు.

లక్షలాది మంది ఎదురుచూపు

ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా లక్షలాదిమంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారు. వీరంతా వ్యవసాయం, అనుబంధరంగాల్లో దినకూలీలు, నిర్మాణ రంగ కార్మికులు, ఇటుక బట్టీలు, షాపింగ్‌కాంప్లెక్స్‌లు, దుకాణాలు, హోటళ్లు, ప్రైవేటు కంపెనీలు, ఆస్పత్రుల్లో పనిచేస్తున్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, జీవన వ్యయాల పెరుగుదలను అధ్యయనం చేసి, కార్మికులతో చర్చించి తదనుగుణంగా ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు వేతన సవరణ సలహా బోర్డును ఏర్పాటు చేశారు. వేతన సవరణ సలహా బోర్డు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సూచనలు ఇస్తుంటుంది.

కేంద్ర ప్రభుత్వం సవరణ..?

తాజాగా కేంద్ర ప్రభుత్వం కార్మికుల కనీస వేతనాన్ని సవరించినట్లు వార్తలు ప్రముఖంగా వచ్చాయి. తాజా సవరణ ప్రకారం నిర్మాణం, స్వీపింగ్, క్లీనింగ్, లోడింగ్, అన్‌లోడింగ్‌లో పనిచేసే నైపుణ్యంలేని కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ.783, నెలకు రూ.20,358, సెమీ స్కిల్డ్ కార్మికులకు రోజుకు రూ.868, నెలకు రూ.22,568, నైపుణ్యం కలిగిన క్లరికల్, నిరాయుధ వాచ్‌మెన్‌కు రోజుకు రూ.954, నెలకు రూ.24,804కు పెంచినట్లు కేంద్ర కార్మిక కమిషనర్ వెబ్‌సైట్లో సమాచారం ఉంచారు. ఇది ఎక్కడా అమలు కావడం లేదు. దీనిపై కార్మికులకు కూడా అవగాహన లేదు. కనీస వేతన నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో ఉండటంతో వారంతా కనీస వేతన సవరణ చేయాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు.

నిద్రావస్థలో కార్మికశాఖ

కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన కార్మిక శాఖ నిద్రావస్థలో మునిగిపోయింది. కార్మికులకు కనీస వేతనం దక్కక శ్రమ దోపిడీకి గురవుతున్నా కార్మిక శాఖ ఎంత మాత్రం పట్టించుకోవడం లేదు. కార్మికుల తరఫున వేతన సవరణ బోర్డుకు సమస్యను నివేదించడంగానీ, అధికారులపై ఒత్తిడి తేడవంగానీ చేయడం లేదు. కనీసం ప్రభుత్వాల ప్రకటనలు, చట్టాలను కూడా కార్మికుల దృష్టికి తీసుకెళ్లడం లేదు. వేతన సవరణ బోర్డు నిర్లక్ష్యం, కార్మిక శాఖ నిస్తేజం కారణంగా ఉమ్మడిజిల్లాలో లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులకు అన్యాయం వాటిల్లుతోంది. ఇప్పటికీ గతంలో నిర్ణయించిన రూ.14వేలే అధికారిక కనీస వేతనంగా కొనసాగుతుండడంతో వారికి శ్రమకు తగ్గ ఫలితం దక్కడంలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో మళ్లీ కార్మికుల్లో వేతన సవరణ ఆశలు ఊపిరి పోసుకున్నాయి. 2018లో కూటమి ప్రభుత్వంలో సిద్ధం చేసిన నివేదిక ఆధారంగా ఏడేళ్లలో వాటిల్లిన మార్పులను దృష్టిలో ఉంచుకుని, కనీస వేతన సవరణ చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కాపురాల్లో మంటలు

ఆకర్షణ, ఆర్థిక అవసరాలతో తప్పటడుగులు
పుట్టుకొస్తున్న అనైతిక బంధాలు
దంపతుల మధ్య పెరుగుతున్న గొడవలు
హత్యలు.. ఆత్మహత్యలతో ముగింపు
ఛిద్రమవుతున్న కుటుంబాలు

హిందూపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు చేపట్టి మూడు నెలలు దాటింది. ఈ సమయంలో వచ్చిన ఫిర్యాదుల్లో 25శాతానికిపైగా భార్యాభర్తలు చేసుకున్నవే. ఇందులో కొంతమంది భార్యలపై భర్తలు ఫిర్యాదు చేశారు. అందులో ఎక్కువభాగం సెల్‌ఫోన్ మాధ్యమాలు తెచ్చిన తంటాగా గుర్తించారు. తన భర్త సఖ్యతగా లేడనీ, నిత్యం ఫోన్‌లో వేరే మహిళతో మాట్లాడుతుంటాడనీ, తనను వెంట తీసుకెళ్లడానికి ఇష్టపడడనీ, ఒంటరిగా వెళ్లడానికి ఉత్సాహం చూపుతాడని చెబుతున్నారట కొందరు భార్యలు. మరికొంతమంది పురుషులు తమ భార్యలు ఇటీవల సఖ్యతగాలేరనీ, చిన్నవిషయానికే తగాదాపెట్టుకుంటున్నారనీ, స్థోమతకు మించి కోరికలు కోరుతున్నారనీ, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, తనను పట్టించుకోవడం లేదని భర్తలు ఫిర్యాదు చేస్తున్నారు. ఇటీవల డివిజన్ పరిధిలో జరిగిన మహిళ హత్య కేసులో ఆమె భర్తను పోలీసులు అరెస్టు చేశారు. తన భార్య మరొకరితో సన్నిహితంగా ఉందనీ, పలుసార్లు చెప్పినా పద్ధతి మార్చుకోకపోవడంతో హత్యచేసినట్లు విచారణలో భర్త ఒప్పుకున్నాడు. కొన్నినెలల క్రితం ఓ మండలంలో తన భర్త.. ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనీ, పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదనీ, తన, పిల్లల బాగోగులు చూసుకోలేదనీ, అయినా అతడిపై



ప్రేమ ఎక్కువ అనీ, ఈ కారణంతో తానే తనువు చాలిస్తున్నానని చుట్టుపక్కలవారికి చెప్పి ఆత్మహత్య చేసుకుంది ఓ మహిళ. హిందూపురం పట్టణంలో కొన్నినెలల క్రితం ఓ దుకాణం నిర్వహించే వ్యాపారి అందులో పనిచేసే మహిళతో సంబంధం పెట్టుకున్నాడని ఆమె భర్త గొడవకు దిగాడు. షాపు యజమానిపై దాడి చేశాడు. దుకాణ యజమాని కుటుంబం ఉన్నతమైనది కావడంతో బయటకు పొక్కకుండా దుప్పటి పంచాయితీ చేశారు. వారం క్రితం హిందూపురం పట్టణంలోని ఒకేరోజు మూడు కుటుంబాలవారు స్టేషన్‌కు వచ్చారు. ఆ మూడు కుటుంబాలవారు వివాహేతర సంబంధాలను కారణంగా చూపుతూ విడాకులు కోరారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. పోలీసు స్టేషన్‌కు చేరనవి కోకొల్లలు.

వివాహేతర సంబంధాలు ఎన్నో కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. మూడు ముళ్ల బంధంతో ఒక్కటై, ఏడడుగులు నడిచి అన్యోన్యంగా ఉంటూ పరస్పర ప్రేమానురాగాలతో జీవించాల్సిన భార్యాభర్తలు అనైతిక బంధాలతో తప్పటడుగులు వేస్తున్నారు. ఒకరు చేసిన తప్పిదానికి కుటుంబం మొత్తం బలైపోతోంది. వీటికి కొన్నిసార్లు హత్యలు, ఆత్మహత్యలతో ముగింపు పలుకుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో వారిని కటకటాలపాలు చేస్తున్నాయి. వారిపై ఆధారపడిన కుటుంబీకులు రోడ్డున పడుతున్నారు. అభం శుభం తెలియని వారి పిల్లల జీవనం దయనీయంగా మారుతోంది.

ఆకర్షణ, ఆర్థిక అవసరాలు..

ఇటీవల వివాహేతర సంబంధాల కారణంగా పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కిన కొందరి వివరాలు చూస్తే ఆకర్షణకు లోనై, అది ప్రేమగా మారి చివరకు ప్రాణాలమీదకు తెస్తున్నాయి. ఇటీవల మహిళలుగానీ, పురుషులుగానీ స్టేషన్‌లో చెబుతున్న వివరాలు పరిశీలిస్తే ఆర్థిక అవసరాలతో అనైతిక బంధాలు ఏర్పడుతున్నట్లు తెలుస్తోంది. చాలామంది మహిళలను విచారించిన సమయంలో పోలీసులు చెబుతున్న వాటిని బట్టి పరిశీలిస్తే ఇరుగుపొరుగువారు, స్నేహితులు, బంధువులు, హోదాను బట్టి తాము కూడా అలాగే ఉండాలని భావిస్తున్నారు. వారికి ఆ స్థోమత ఉండదు. దీంతో ఆర్థిక అవసరాలను బట్టి తప్పటడుగులు వేస్తున్నారు.

అనుమానాలే పెనుభూతాలై..

ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ అత్యవసరమైన వస్తువుగా మారిపోయింది. ఇది భార్యాభర్తల మధ్య సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొత్త వ్యక్తులతో పరిచయం, ఆ తరువాత ప్రేమ, వివాహేతర సంబంధాలకు దారితీస్తోంది. ఒకప్పుడు పరాయి పురుషుడితో మాట్లాడాలంటేనే జంకేవారు. సెల్‌ఫోన్ పుణ్యమా అని ఎవరితోనైనా, ఎక్కడినుంచైనా మాట్లాడుతున్నారు. ఇది వివాహేతర సంబంధాలకు దారితీసి, ఆలుమగల మధ్య అనైక్యతకు తావిస్తోంది. బయటి వ్యక్తులపట్ల ఆకర్షణకు కారణమవుతోంది. ఇటువంటి వ్యవహారాలు, జీవితం అథఃపాతాళానికి పడిపోయేలా చేస్తున్నాయి. భార్య తనను మోసం చేసిందని భర్త, తాళి కట్టిన భర్త వేరే మహిళ మోజులోపడి తనను దూరం పెడుతున్నాడని భార్యకు అనుమానం పెంచుకుంటున్నారు. కొంతమంది ఎక్కువ మందితో పరిచయాలు పెట్టుకోవడంతో హత్యలకు దారితీస్తున్నాయి. వివాహేతర సంబంధాల విషయంలో భార్యాభర్తల మధ్య ఎక్కువగా కక్షసాధింపులు జరుగుతున్నాయి. అనైతిక సంబంధాలు వద్దని ఇంట్లోవారు వారిస్తే ఆత్మహత్యలు చేసుకునేందుకు కూడా వెనుకాడటంలేదు. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవడంతో నచ్చజెప్పేవారులేక భార్యాభర్తలు ఎవరికివారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఇరువురి మధ్య బంధం కాస్తా.. వైరంగా మారుతోంది. కొంతమంది యువకులు చేసే పనుల కారణంగా ఎంతో పరువుగా బతికిన వారి కుటుంబాలు తలదించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

సూచనలు.. అభ్యంతరాలు తెలపండి

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప-వర్గీకరణపై ఆయా కులాలవారు అభ్యంతరాలు, సూచనలు తెలపాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి శివరంగప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ ఉప-వర్గీకరణపై రాజీవ్‌రంజన్‌మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను విజయవాడలోని గిరిజనసంక్షేమశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేశారన్నారు. ఈవిషయంపై సంతకంతో కూడిన రాతపూర్వక అభ్యంతరాలు తెలపవచ్చన్నారు. కార్యాలయ పనివేళల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల్లోపు వ్యక్తిగతంగాగానీ, పోస్టుద్వారాగానీ, omcscsbclassifica-tongmail.com వెబ్‌సైట్ ద్వారాగానీ అభ్యంతరాలు, సూచనలు పంపవచ్చన్నారు. జనవరి 9వతేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు.

పోక్సో కేసు నమోదు

గార్లదిన్నె, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంటిమడుగు గ్రామానికి చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ముంటిమడుగుకు చెందిన వంశీ బొలెరో వాహనం నడుపుతుండేవాడు. కొన్నిరోజుల క్రితం మండలానికి చెందిన ఓ యువతిపై అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆయుర్వేద వైద్యాధికారి పోస్టుల ఎంపిక జాబితా విడుదల

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆయుష్ విభాగం ఆయుర్వేద వైద్యాధికారి పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను ఏపీపీఎస్సీ మంగళవారం ప్రకటించింది. మొత్తం 67 మంది ఉద్యోగాలు సాధించినట్లు తెలిపింది. ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం తుది ఫలితాలను వెల్లడించింది.

దేవుడి భూమి సైతం..

చెన్నకేశవుడి మాన్యం అన్యాక్రాంతం
సక్రమంగా కౌలు చెల్లించని వైనం
పర్యవేక్షణ లేకపోవడం వల్లే..?


దేవదాయ భూముల్లో సాగు చేసిన ఉలవ పంట

శింగనమల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలో దేవుడికి ఇచ్చిన మాన్యం భూములు కొన్ని అన్యాక్రాంతమవుతున్నాయి. ఉన్న భూమిని కౌలుకు తీసుకున్నవారు సైతం సక్రమంగా కౌలు చెల్లించడం లేదు. దీంతో దేవదాయశాఖ ఆదాయానికి గండిపడుతోంది. అనంతపురం పాతూరు లక్ష్మీ చెన్నకేశవ స్వామికి మండలంలోని చిన్నజలాలపురంలో 150 ఎకరాల మాన్యం భూమి ఉంది. ఇందులో చాలా వరకు కబ్జా అవుతోంది. గ్రామంలో 150 ఎకరాలు మాన్యం భూములు వెస్టునరసాపురం రెవెన్యూ గ్రామం సర్వేనంబర్లు 115,116,117 118 145, 175 187 188 191 192 193 210 212 213 214 216ల్లో 150 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. ఈ భూములను ప్రతి సంవత్సరం వేలం ద్వారా రైతులకు కౌలుకు ఇస్తారు అయితే గతంలో భూములు బాగానే సాగులో ఉండేవి. గత 12 సంవత్సరాలుగా వేలం సక్రమంగా నిర్వహించకపోవడంతో అప్పుడు పలుకుబడి ఉన్న వ్యక్తులు 10 నుంచి 20 ఎకరాలు వేలం తీసుకుని, అంతో ఇంతో రుసుం చెల్లించి చేతులు దులుపుకున్నారు. పర్యవేక్షణ చేయవలసిన దేవదాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో 30 ఎకరాల నుంచి 40 ఎకరాలు మాత్రమే సాగులో ఉంది. చాలా భూములను ఇప్పటికై కొందరు కబ్జా చేసి పంటలు సాగు చేస్తున్నారు. అధికారుల మాత్రం కబ్జాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కనీసం కబ్జాదారులకు నోటీస్‌లు కూడా జారీ చేయకపోవడం గమనార్హం.

16న వేలం వేస్తున్నాం: శోభారాణి, ఈఓ

అనంతపురం లక్ష్మీ చెన్నకేశవస్వామి మాన్యం భూమి చిన్నజలాలపురంలో 150 ఎకరాలు ఉంది. ఈ భూములకు ఈనెల 16న కౌలు వేలం వేస్తున్నాం. రైతులు కౌలును బహిరంగ వేలంలో పాడుకోవచ్చు. ఈ భూములను ఎక్కడైనా, ఎవరైనా ఆక్రమించి ఉంటే వెంటనే వారిపై కేసులు నమోదు చేసి భూమిని స్వాధీనం చేసుకుంటాం. వేలం ప్రక్రియ పూర్తయిన తర్వాత కబ్జాపై విచారణ చేస్తాం.


బీడుగా దేవదాయ భూములు

న్యూస్‌బాక్స్



మాట్లాడుతున్న న్యాయాధికారి

రిమాండ్ దశలో న్యాయసలహాలు తీసుకోండి - డీఎల్ఎస్ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అరెస్ట్ సందర్భంతోపాటు రిమాండ్ సమయంలో నిందితుడికి ఉన్న హక్కులపై న్యాయసలహా పొందాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ అన్నారు. స్థానిక లోక్‌అదాలత్ హాల్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన పోలీస్ ఆఫీసర్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. అరెస్ట్, రిమాండ్ స్టేజిలో అందుబాటులో ఉన్న న్యాయ సలహా వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సౌదీలో ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేసిన యువతీయువకులకు సౌదీ అరేబియాలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 35 సంవత్సరాలలోపు వయస్సు ఉండి నర్సింగ్ పూర్తి చేసినవారు అర్హులన్నారు. ఆసక్తిగలవారు 9988853335, 8790117279 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

టమోటా కిలో రూ.17

అనంతపురం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.17తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 750 టన్నుల దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 11, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు తెలిపారు.

చీనీ టన్ను రూ.37వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.37,280 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 20వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 57టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

1.681 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 935 క్యూసెక్కులు జీండగా ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ 2కు 895 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

క్రైంకార్నర్

హత్యకేసు నిందితుడి అరెస్ట్

తాడిపత్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో ఈనెల 7న నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లికి చెందిన కంబన్నను హత్యచేసిన కేసులో పుట్లూరుకు చెందిన చిన్న కంబగిరిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అతడి నుంచి సెల్‌ఫోన్, రూ.300 స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ కంబన్న చిత్తూరు జిల్లాలోని వెంకటాపాళ్యంలో గ్రానైట్ పరిశ్రమలో వాచ్‌మన్‌గా పని చేసేవాడన్నారు. డప్పు కళాకారులకు ఇచ్చే పింఛన్ మొత్తాన్ని తీసుకోవడానికి స్వగ్రామానికి వచ్చాడన్నారు. అనంతరం చిత్తూరు వెళ్లేందుకు తాడిపత్రి రైల్వేస్టేషన్‌కు బయలుదేరాడు. స్టేషన్ సమీపంలో ఉన్న మద్యం షాపు వద్ద కంబన్నను నిందితుడు చిన్నకంబగిరి గమనించాడన్నారు. కంబన్నను పరిచయం చేసుకొని ఇరువురు మద్యం బాటిళ్లను తీసుకొని రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారన్నారు. 1వ ప్లాట్‌ఫారం చివరికి చేరుకొని కూర్చొన్నారన్నారు. చిన్న కంబన్న వద్ద ఉన్న రూ.1500 నగదు, సెల్‌ఫోన్‌ను నిందితుడు గమనించాడన్నారు. వాటిని కాజేయడానికి వెనుకవైపు నుంచి ఇటుకతో తలపై బాదాడన్నారు. దీంతో చిన్నకంబన్న కిందపడి మరణించాడన్నారు. అనంతరం జేబులో ఉన్న నగదు, సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడన్నారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలించామన్నారు. అందిన సమాచారం మేరకు నిందితున్ని పట్టణంలోని టీటీడీ కల్యాణమండపం వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

రాయదుర్గం టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో రైలు కింద పడి గంగాధర్(28) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం వెలుగు చూసింది. టీ వీరాపురం గ్రామానికి చెందిన గంగాధర తల్లి అంజినమ్మ గత వారంరోజులుగా ఆచూకీ లేకుండా పోయింది. ఆమె అదృశ్యంపై రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. తల్లి కనిపించకుండా పోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గంగాధర్ తండ్రి బండా రామన్న వ్యవసాయ కూలీ. గంగాధర్ సైతం వ్యవసాయ కూలీగా ఉండి కుటుంబానికి అండగా ఉండేవాడు. తల్లి ఆచూకీ లేకుండా పోవడాన్ని జీర్ణించుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


మాతృదేవోభవ నాటికలోని సన్నివేశం

అలరించిన మాతృదేవోభవ

పుట్టపర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలవికాస్ విద్యార్థులు చేపట్టిన మాతృదేవోభవ నృత్యరూపకం భక్తులను అలరింపజేసింది. గుంటూరు జిల్లా భక్తులు పర్తియాత్రగా మంగళవారం స్థానిక ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మొదట బాలవికాస్ చిన్నారులు చెక్కభజన చేశారు. అనంతరం మాతృదేవోభవ నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. శివపురాణం, మాతృమూర్తి ప్రేమతత్వంపై చిన్నారులు నృత్యంతో అలరింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

సత్యమ్మ ఆలయంలో చోరీ

130తులాల వెండి అభరణాలు, నగదు అపహరణ

ధర్మవరంరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం గ్రామ సమీపంలోని సత్యమ్మ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఆలయ తలుపు గడియను ధ్వంసం చేసి, దొంగలు చొరబడ్డారు. అమ్మవారికి అలంకరించిన 130తులాల వెండి అభరణాలు, హుండీ పగులగొట్టి అందులోని సుమారు రూ.30వేల నగదు అపహరించుకెళ్లారు. మంగళవారం ఉదయం గ్రామస్థులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఆలయాన్ని పరిశీలించి, గ్రామస్థులను ఆరాతీశారు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.


ఆలయ తలుపును ధ్వంసం చేసిన దృశ్యం

ఉరవకొండలోని రెండిళ్లలో...

బంగారు నగలు, డబ్బు అపహరణ

ఉరవకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పదో వార్డులో సోమవారం అర్ధరాత్రి దొంగలు రెండిళ్లలో చోరీ చేశారు. స్థానిక బళ్లారి రోడ్డులో నివాసం ఉంటున్న రైల్వే రిటైర్డ్ ఉద్యోగి, టైలర్ ఇళ్లలోకి గుర్తు తెలియని దుండగులు చొరబడి బంగారు ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లారు. రైల్వే రిటైర్డ్ ఉద్యోగి సోమ్లా నాయక్ ఈ నెల ఐదో తేదీ ఇంటికి తాళాలు వేసి భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. ఇది గుర్తించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి ఇంటిలోని రూ. 50వేలు నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు, ఇంటికి సంబంధించిన పత్రాలను ఎత్తుకుపోయినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. అదే భవనంపైన ఉన్న ఇంటిలో వన్నూరుస్వామి నివాసం ఉంటున్నాడు. ఆయన ఇంటికి తాళాలు వేసి కుటుంబసభ్యులతో కలిసి సోమవారం ఊరికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంట్లో తులం బంగారు, రూ.5వేల నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని సీఐ మహానంది, ఎస్ఐ జనార్దన నాయుడు, క్లూస్‌టీం పరిశీలించారు. క్లూస్ టీం చోరీ జరిగిన ఇళ్లలో ఆధారాలను సేకరించారు. పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు.

యువతి అదృశ్యం.. ఫిర్యాదు

సోమందేపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన షాజియా(17) మంగళవారం ఉదయం నుంచి కనిపించకుండా పోయిందని తండ్రి ముస్తఫా.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన మేరకు.. షాజియా ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఆ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

సోమందేపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. పదో తరగతి చదువుతున్న బాలికను వరుసకు మామ అయ్యే వ్యక్తికిచ్చి బుధవారం వివాహం చేయడానికి నిశ్చయించారు. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఐసీడీఎస్ సీడీపీఓ అనురాధ పోలీసులతో కలిసి గ్రామానికెళ్లారు. బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. కుటుంబ సభ్యులను స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రమేష్.. బాలిక తల్లికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహ నేరమన్నారు. అలాచేస్తే కేసు నమోదుచేసి, జైలుకు పంపుతామని హెచ్చరించారు. యువతికి పెళ్లి వయసు వచ్చేవరకు ఇలాంటి ప్రయత్నాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో లోకేశ్, మహిళా పోలీసు మేనక, పీఎస్ మల్లికార్జున పాల్గొన్నారు.

దర్జాగా దోపిడీ..!



పోతులనాగేపల్లి వద్ద చిత్రావతి నదిలో పంచాయతీ బోరు చుట్టూ ఇసుకను తోడేసిన దృశ్యం

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పొలాలనూ వదలని ఇసుకాసురులు
- భూగర్భ జలాలు తగ్గుతాయని వాపోతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

ధర్మవరంరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు చేపట్టి ఇష్టారాజ్యంగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కాలువలు, వాగులు, వంకలు, రైతుల పొలాల్లో సైతం వదలకుండా ఇసుకను గుల్లా చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఇసుకాసురులు మరింత రెచ్చిపోతున్నారు.

● కూటమి రాకతో మరింత దోపిడీ

గత వైసీపీ ప్రభుత్వం ఇసుకను బంగారంగా చేసింది. కేవలం బడావాళ్లకే మాత్రమే తీసుకెళ్లే విధంగా ఉండేది. పేదలు ఇళ్లు కట్టుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. కూటమి ప్రభుత్వం రాగానే ఇసుకను పేదప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఇసుక కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో నేరుగా ఎంత ఇసుక కావాలో నమోదు చేసుకుంటే వారికి ఇసుక అందుబాటులోకి తెచ్చేలా చేసింది. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో తీసుకెళ్లవచ్చిన ఆదేశాలు ఇచ్చింది. దీంతో కొంతమంది ఇసుకాసు రులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి పట్టణాలకు ఇసుకను అమ్ముకుంటూ సొమ్ముచేసుకొంటున్నారు. ప్రకృతి సంపదను దోచేస్తున్నారు. ఇలాగైతే భవిష్యత్తు తరాలకు ఇసుక కనుమరుగు అయ్యే అవకాశం ఉంటుందని, భూగర్భ జలాలూ పూర్తిగా పడిపోతా యని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● పొలాలనూ వదలని వైనం

ధర్మవరం మండలంలోని తుంపర్తి, మల్లాకాల్వ, పోతులనాగేపల్లి, సీసీకొత్తకోట గ్రామ పరిధిలోని చిత్రావతి నది నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ధర్మవరం పట్టణానికి చెందిన రఘునాథ్‌రెడ్డి, భగవంతప్ప అనే రైతులు మల్లాకాల్వ వద్ద గత కొన్నేళ్ల క్రితం 27ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అయితే ఆ పొలం చిత్రావతి నదికి సమీపాన ఉండటంతో ఇసుకాసురులు విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ ఇసుక గుంతలు తీశారు. ఆ రైతులు అక్కడికి వెళ్లి వారిని ఎంతవారించినా వినలేదు. దీంతో సుమారు 20ఎకరాల వరకు గుంతలు గుంతలు చేశారు. పొలానికి వేసుకున్న ఫెన్సింగ్‌ను పూర్తిగా ధ్వంసం చేసి ఇసుకను



పొలంలోని ఇసుకను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న కూలీలు

తరలించారు. వీటిపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు. అదేవిధంగా చిత్రావతి నదిలో ట్రాక్టర్లతో రాత్రి, పగలు ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారని గ్రామస్థులు వాపోతున్నారు.

● చిత్రావతి నది ఛిద్రం

పోతులనాగేపల్లి, మల్లాకాల్వ, తుంపర్తి, తిప్పేపల్లి, సంఘమేశ్వర క్షేత్రం గ్రామ పరిధిలో చిత్రావతి నది



పొలానికి ఏర్పాటు చేసిన కంచెను తొలగించిన దృశ్యం

పారుతోంది. ఈ చిత్రావతి పరిధిలో ఇసుకను రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి సొమ్ముచేసుకుంటున్నారు. అదేవిధంగా ఈ గ్రామాల పరిధిలో ఇసుకను డంప్ చేసినట్లు సమాచారం. చిత్రావతి నదిని ఛిద్రం చేశారని గ్రామస్థులు మండిపడుతున్నారు.

● ట్రాక్టర్ ఇసుక ధర 4వేలు

మల్లాకాల్వ, తుంపర్తి, పోతులనాగేపల్లి, మల్కాపురం వంక నుంచి ధర్మవరం పట్టణానికి అయితే ఇసుక ట్రాక్టర్ ధర రూ.4వేల వరకు పలుకుతోంది. ఇతర ప్రాంతాలకు అయితే మరింత రేటు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో రేటును పెట్టుకుని ఇసుక దోపిడీ చేస్తున్నారు.

కేసులు నమోదు చేస్తాం

పొలాలు, వాగులు, వంకల్లో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తాం. మల్లాకాల్వ, తుంపర్తి రైతులు తమ పొలాల్లో కొంతమంది ఇసుకను తోడేస్తున్నట్లు రైతులు తమ దృష్టికి తెచ్చారు. దీంతో కొంతమందిని గుర్తించి వారిని స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించాం. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాం. అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించేది లేదు. సిబ్బందితో తనిఖీలు చేయిస్తాం. అక్రమ రవాణాను అడ్డుకుంటాం.

-శ్రీనివాసులు, ధర్మవరం రూరల్ ఎస్‌ఐ

న్యూస్ బాక్స్...

నేడు పెడపల్లిలో రెవెన్యూ సదస్సు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెడపల్లిలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు గ్రామ రెవెన్యూ సదస్సును నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పాల్గొనే ఈ సదస్సులో అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరుతున్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

ధర్మవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ గీతావాణి మంగళవారం ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మానవ హక్కుల దినోత్సవం

ధర్మవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా మానవహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తోటి వారి హక్కులను భంగం కల్గించకుండా మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చిట్టెమ్మ, అధ్యాపకురాలు గోపాల్‌నాయక్, పావని, కిరణ్ కుమార్, భువనేశ్వరి, పుష్పావతి, మీనా, ఆనంద్ పాల్గొన్నారు. అలాగే స్థానిక సాయికృప జూనియర్ కళాశాలలో ప్రపంచ మానవహక్కుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరీక్షా పోటీల్లో విజేతలకు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐహెచ్‌ఆర్‌పీసీ నేషనల్ లీగల్ సెల్ ప్రసిడెంట్ సుమలత, జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, సాయికృప కళాశాల కరస్పాండెంట్ భగవంతరెడ్డి పాల్గొన్నారు.

● కదిరి అర్బన్ : స్థానిక బాలికల జూనియర్ కళాశాల ఆవరణంలో మానవ హక్కుల దినోవత్సవాన్ని ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బాబ్‌జాన్, అఖిల్, విజయ్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, నాయకురాల్లు సుజాత, మున్నీ, రమణమ్మ పాల్గొన్నారు.

నేడు, రేపు గ్రామాభివృద్ధిపై శిక్షణ

నల్లచెరువు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధిపై బుధ, గురువారల్లో మండలస్థాయి అధికారులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త తెలిపారు. ఈశిక్షణకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని సచివాలయాల డిజిటల్, వెల్ఫేర్, మహిళ సంక్షేమ కార్యదర్శులు హాజరుకావాలన్నారు. ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించే శిక్షణకు మడలంలోని రెవెన్యూ అధికారులు, సర్వేర్లు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎలు హాజరుకావాలన్నారు.

కాంప్లెక్స్ ఎరువులతో అధిక దిగుబడి

నల్లచెరువు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాంప్లెక్సు ఎరువులు వాడకంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ సనావుల్లా సూచించారు. మంగళవారం మండలంలోని చవిటివారిపల్లి, మద్దిమడుగు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేరుశనగ సాగుచేసిన రైతులు ఎకరాకు జిప్సమ్ నాలుగు బస్తాలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ భారతి, వీహెచ్ఏ భాస్కర్, ఎంపీఈఓ మణికంఠ పాల్గొన్నారు.

పాఠశాలకు సైన్సు పరికరాల అందజేత



సైన్సు పరికరాలను అందచేస్తున్న ఆర్డీటీ సిబ్బంది

గాండ్లపెంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లి జిల్లాపరిషత్ ఉన్నపాఠశాలకు రూ.50వేల విలువ చేసే సైన్సు పరికరాలను ఆర్డీటీ సంస్థ మంగళవారం అందజేసింది. కార్యక్రమంలో ఆ పాఠశాల పూర్వ విద్యార్థి సిద్ధా ప్రభావతి, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, ఏటీఎల్ బాషా, హెచ్‌ఎం సరళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

కదిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తలుపుల పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ శివనారాయణస్వామి మంగళవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్ఐ నరసింహుడు, సిబ్బంది ఉన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేయిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగాటిపల్లి గ్రామంలో టీడీపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. సభ్యత్వాల నమోదులో ధర్మవరం జిల్లాలోనే అగ్రస్థానంలో ఉండాలని, రాష్ట్రంలో టాప్-5 స్థానంలో ఉండేవిధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, నాయకులు చింతలపల్లిమహేశ్ చౌదరి, ముచ్చురామికిష్ట, రేగాటిపల్లి నాగేంద్ర రెడ్డి,వరదరాజులు, రాంపురంశీన, పఠాన్‌బాబుఖాన్, కేశగాళ్లశీన, చిన్నూరువిజయ్‌చౌదరి, అమరాసుధాకర్, ఇర్షాద్ పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించండి

నల్లమాడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమాడ నుంచి దొన్నికోట మీద పులగంపల్లి వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపు ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. ఈ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఉండటంతో.. పొరపాటున పాదాచారులు, వాహనదారులు సిగరెట్, బీడీ, అగ్గిపుల్ల వేస్తే మంటలు చెలరేగి.. రోడ్డు పక్కన రూ.లక్షలు ఖర్చు పెట్టిన చెట్లు దగ్ధం అవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



దొన్నికోట రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు

కూటమితోనే భూములకు రక్షణ

● రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ● గైర్హాజరైన అధికారులకు మెమోలు

కొత్తచెరువు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, మంత్రులు చేసిన భూ దందాతో భూ సమస్యలు తలెత్తాయని, వాటిని పరిష్కరించి.. భూములకు రక్షణ కల్పించడానికే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో తహసీల్దార్ నీలకంఠారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇకపై పేదల, ప్రభుత్వ భూములు ఎవరైనా ఆక్రమించడానికి చూస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సదస్సుకు గైర్హాజర్ అయిన అధికారులకు మెమోలు జారీ చేయాలని తహసీల్దార్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ మంత్రిపల్లెరఘునాథరెడ్డి, ఎంపీడీఓ నటరాజ్, సర్పంచ్ రాధానాగరాజు, ఏఓ నటరాజ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: మండలంలోని వెంకటాపురం పంచాయతీ వీర ఓబునపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రెవిన్యూ సదస్సులకు



కొత్తచెరువులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పెషలాఫీసర్ రామక్రిష్ణ, తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్టు విల్సన్‌ను ఆదేశించారు. ప్రజాసమస్యలపై సదస్సు నిర్వహిస్తుంటే అధికారులు హాజరుకాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఓడీసీ మండలకేంద్రంలో సబ్‌రిజిష్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆర్పీపీ నాయకులు ఎమ్మెల్యేను విన్నవించారు. ఓడీసీ, నల్లమాడ, అమడగూరు మండలాలకు ప్రధానంగా ఓడీచెరువు ఉందని, కావున ఓడీసీలో సబ్‌రిజిష్టర్ కార్యాలయం ఏర్పాటు చేస్తే అనువుగా ఉంటుందని అన్నారు.

● పుట్టపర్తిరూరల్: మండలంలోని గంగిరెడ్డిపల్లి సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన గామరెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. భూ కబ్జాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, సర్పంచ్ కామాక్షమ్మ, తహసీల్దార్ అనుపమ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తులసీరెడ్డి

జమిలి ఎన్నికలు అసాధ్యం

కదిరి అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలకు వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని, ఇది ఆచరణకు సాధ్యం కాదని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దేశమంతటా లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరపడం అసాధ్యమన్నారు. ఇందుకు 18 రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుందన్నారు. లోక్‌సభ, రాజ్యసభలో 3/2 వంతున మెజార్టీ ఉండాలన్నారు. మోడీ ప్రభుత్వానికి లోక్ సభలో 69, రాజ్యసభ లో 43 సీట్లు తక్కువ ఉన్నాయన్నారు. ఎన్నికల ఖర్చు మొత్తం బడ్జెట్‌లో 0.01శాతం మాత్రమేనని, కావున ఎన్నికల ఖర్చు తగ్గించుకోవడం కోసమే జమిలి ఎన్నికలకు వెళ్లడం అర్థం లేదని అన్నారు. మనది సమైఖ్య వ్యవస్థ అని, దీనికి జమిలి ఎన్నికలు విరుద్ధమని అన్నారు. అభివృద్ధి చెందిన అమెరికా దేశంలో కూడా జెమిలి ఎన్నికలు లేవన్నారు. జమిలి ఎన్నికలు అవినీతి, నియంతృత్వానికి దారితీస్తాయన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు షానవాజ్, అల్లాబక్ష, జైనుల్లా, నాగేంద్ర, జబీబుల్లా, షబ్బీర్, నాగరాజు పాల్గొన్నారు.

ఆలయానికి దారి ఏర్పాటు చేయండి

నంబులపూలకుంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరికొమ్మదిన్నె గ్రామంలో అటవీ భూముల్లో ఉన్న మూలగుట్ట మల్లయ్యస్వామి ఆలయానికి రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జీ తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు గ్రామస్థులు కోరారు. మంగళవార ం మరికొమ్మదిన్నెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఈ మేరకు వారు వినతి పత్రం అందజేశారు. ఈరహదారి గుండా చాలా మంది రైతులు పొలాలకు వెళ్తుంటారన్నారు. కార్యక్రమంలో కేవీ ఆంజనప్ప నాయుడు, పాల్‌రెడ్డి, బాలక్రిష్ణ, బావాఖాన్, హమానుల్లా, రాఘవరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఓబులరెడ్డి పాల్గొన్నారు.

ఎస్కేయూ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కేరళలోని కాలికట్ యూనివర్శిటీలో ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ ఫుట్‌బాల్ పోటీలకు మంగళకర విద్యార్థులు ఎంపికయ్యారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ ఫుట్‌బాల్ జట్టు తరపున వీరు పాల్గొంటున్నట్లు మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్టీ సురేష్‌కుమార్ మంగళవారం పేర్కొన్నారు. మండలంలోని జగరాజుపల్లి మంగళకర డిగ్రీ కళాశాలలో బీబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాబు, యూసుఫ్, బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న చిన్న, జగదీష్, బీబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న అరవింద్ ఈ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు.



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

జనసేన పార్టీలో పలువురి చేరిక

ధర్మవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుకుంట గ్రామంలో బ్యాల్లభాస్కర్ ఆధ్వర్యంలో 70 కుటుంబాలు జనసేన పార్టీలో మంగళవారం చేరాయి. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



తాగునీటి పైపు లీకేజీ

ధర్మవరంరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడన్నపల్లి గ్రామంలో తాగునీటి పైపు లీకేజీ వల్ల నీరంతా వృథా అవుతోంది. నీరు వదిలినప్పుడు రోడ్డుపై పారుతూ.. నిల్వ ఉంటోందేని, నీరు బంద్ అయినప్పుడు అదే నీరు పైప్ లీకేజీ వల్ల అందులోకి వెళ్తున్నాయని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. దీంతో తాగునీరు కలుషితం అవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజులతరబడి నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో దోమలూ విపరీతంగా పెరిగాయని, ఈ విషయాన్ని సచివాలయం అధికారులకు తెలిపినా వారు స్పందించడంలేదని మండిపడ్డారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.



వృథాగా పోతున్న తాగునీరు



రోడ్డుపై నిలిచిన నీరు

క్రైం న్యూస్ ..

చెరువులో పడి వృద్ధురాలి మృతి



లక్ష్మీదేవి(ఫైల్)

ధర్మవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ధర్మవరం చెరువులో పడి ఓ వృద్ధురాలు మంగళవారం మరణించింది. స్థానిక సిద్దయ్యగుట్టకు చెందిన లక్ష్మీదేవి (57) చెరువు వద్దకు బట్టలు ఉతకడానికి వెళ్లింది. కాలు జారి చెరువులో పడి మునిగిపోయింది. కొద్దిసేపటి తరువాత చెరువులో ఆమె మృతదేహం తేలుతూ ఉండటాన్ని గమనించిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లక్ష్మీదేవికి భర్త వెంకటరాముడు ఉన్నాడని, కుమారుడు వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

ఇద్దరికి గాయాలు

నల్లమాడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నల్లమాడకు చెందిన బాబావలీ, రమేష్ ద్విచక్రవాహనంలో స్థానిక బీసీ హాస్టల్ వైపు నుంచి బస్టాండ్‌కు బైక్‌పై మంగళవారం వెళ్తుండగా.. అదుపుతప్పి కింద పడ్డారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కదిరికి తరలించారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు ముసుగు మధు

అదానీ అవినీతిపై విచారణ చేయించాలి

ధర్మవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అదానీ గ్రూపు కంపెనీల అవినీతిపై విచారణ చేయించి, కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ... రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో పంటలకు మద్దతు ధర కోసం శాంతియుతంగా ర్యాలీ చేస్తుంటే మోదీ ప్రభుత్వం.. వారిపై భాష్పవాయువును ప్రయోగించడం దారుణమన్నారు. దేశంలో అదానీ గ్రూపు కంపెనీలు విద్యుత్ ఒప్పందాల్లో కుంభకోణాలను వెలికితీయాలనీ, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు మానుకోవాలని అన్నారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప, రైతుసంఘం జిల్లాకార్యదర్శి కాటమయ్య, చేనేత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి గౌరవాధ్యక్షుడు వెంకటనారాయణ పాల్గొన్నారు.

టీచర్లను నియమించండి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కొత్తచెరువు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ కిష్టప్పకు వినతిపత్రం అందజేసిన వారు మాట్లాడారు. హిందీ, తెలుగు, పీఈటీ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలోని గణేశ్ ఉన్నత పాఠశాలలో హిందీ, తెలుగు టీచర్లు, అలాగే నెహ్రూ మున్సిపల్ ఉన్నతపాఠశాలలో హిందీ, పీఈటీ టీచర్లు, ఎల్‌సీకేపురంలో మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్లు లేరని వివరించారు. ఉపాధ్యాయులులేక విద్యార్థులు చదువులో వెనకబడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఆయా ఖాళీలను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలనిడీ ఈఓను కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌చంద్ర, నాయకులు కేశవ, భాస్కర్, అక్కులప్ప, కిష్టప్ప, సేవేనాయక్, రంగయ్య, మురళి పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

ధర్మవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ధర్మవరం శాఖ గ్రంథాలయాన్ని ఆ శాఖ కార్యదర్శి రమ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయంలో పన్ను బకాయిల గురించి గ్రంథాలయాధికారి అంజలి సౌభాగ్యవతిని అడిగితెలుసుకున్నారు. ఆమె వెంట సిబ్బంది సత్యనారాయణ, శివమ్మ, రమణ, గంగాధర్ ఉన్నారు.

క్లుప్తంగా..

ఘనంగా హిరియూరు మారెమ్మ ఆరాధన



మారెమ్మకు విశేష పూజలు నిర్వహిస్తున్న గుండుమల

మడకశిరటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని శివపురంలో హిరియూరు మారెమ్మ ఆరాధన ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ వాసులతోపాటు చుట్టుపక్కల గ్రామస్తులు సైతం పాల్గొని అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

పరిగి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు మంగళవారం పరిగి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూపురం పట్టణానికి పరిగి సరిహద్దు సమీపంలో ఉన్నందున గంజాయిపై పోలీసులు, సిబ్బంది దృష్టి ఉంచాలని, ద్విచక్రవాహనాలు నడిపే యువత అధిక వేగంగా ప్రయాణించకుండా హెల్మెట్లు ధరించి నెమ్మదిగా వెళ్లేలా చూడాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి నేరాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రంగడుయాదవ్, ఎఎస్ఐ వెంకటేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష

పరిగి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో 300 మంది అయ్యప్ప మాలాధారులకు మంగళవారం టీడీపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం నిర్మాణ పనులు కొనసాగుతున్న విషయాన్ని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లగా, ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా తనవంతు కృషిచేస్తానంటూ హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోవిందరెడ్డి, బీచిగానిపల్లి సర్పంచ్ బాలాజీ, రెడ్డివారి మంజునాథ్, మాజీ ఎంపీపీ సత్యనారాయణ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పెనుకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని టింబక్టివ్ కలెక్టివ్ దుర్గాశక్తి సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత న్యాయ సేవా సదస్సు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో సొసైటీ ప్రదాన కార్యనిర్వాహణ అధికారి సవిత మాట్లాడుతూ.. కుటుంబంలో మహిళలు ఏవిధమైన జాగ్రత్తలు తీసుకుని సమాజంలో ఏవిధంగా జీవించాలో తెలిపారు. అనంతరం బాల్య వివాహాలు చేయడం చట్టరిత్యా నేరమని సూచించారు. కార్యక్రమంలో దుర్గా సొసైటీ అధ్యక్షురాలు ముంతాజ్‌బేగం, మహాశక్తి కోఆర్డినేటర్ గౌరీ, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

గోరంట్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం చికిత్స నిమిత్తం వచ్చిన గర్భవతులు, బాలింతలకు సీఐ శేఖర్, చిన్నపిల్లల వైద్యులు శివకుమార్ పౌష్టికాహారం పంపిణీని ప్రారంభించారు. శ్రీసత్యసాయిబాబా జిల్లా మహిళ సేవాదల్ కోఆర్డినేటర్ విజయలక్ష్మీ, శివారెడ్డి దంపతులు పౌష్టికాహారాన్ని సమకూర్చారు. కొంతకాలంగా ఆసుపత్రిలో గైనకాలజీ వైద్యులు లేకపోవడంతో పౌష్టికాహార పంపిణీ ఆగిపోయింది. ఇటీవల కదిరినుంచి గైనకాలజీ డాక్టర్ ప్రత్యూషాను వారంలో ఒకరోజు పనిచేసేలా అధికారులు ఏర్పాటు చేశారు. దూరప్రాంతాలనుంచి ఆసుపత్రికి వచ్చే వారికి సకాలంలో ఆహారం లభించక ఇబ్బంది పడేవారు. పరిస్థితిని గమనించి వైద్యుల సూచన మేరకు విజయలక్ష్మీ అన్నదాన కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు వినోద్‌కుమార్, ఉషా, వేణుగోపాల్, సేవాదల్ సభ్యులు సుబ్బరాయుడు, రత్నమయ్య, డివి. రమణ, వెంకటేష్, సునీత తదితరులున్నారు.

నేడు భగవద్గీత పారాయణం

హిందూపురం అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని సత్యనారాయణపేట శ్రీ శేషసాయి సంస్థాన్ నాగులకట్ట వద్ద బుధవారం గీతా జయంతిని పురస్కరించుకొని భగవద్గీత భక్తి షట్కం పారాయణం, గీతా సత్సంగం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆచార్య శివస్వామి శ్రీ ఆది శంకర గురు పరంపర వారు ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారన్నారు. సాయంత్రం 5 గంటలకు పారాయణం ప్రారంభమవుతుందన్నారు. సమస్త ప్రజలు ఆహ్వానితులేనని గీతాజ్ఞానాన్ని విని జీవుడే దేవుడని తెలుసుకోవాలని కోరారు.

బాబయ్య సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు

పెనుకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిచెందిన పెనుకొండ బాబయ్యస్వామి 752 ఉరుసు ఉత్సవాల సందర్భంగా వంశపారంపర్య దర్గాపీఠాధిపతి తాజ్‌బాబా ఆధ్వర్యంలో స్వామి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉరుసు ఉత్సవాలను ప్రారంభించారు. మంగళవారం రాత్రి స్వామి సమాధిని సుగంధ ద్రవ్యాలు, పవిత్రమైన జంజం నీరుతో కడిగి వివిధ రకాల పూలతో అలంకరించి దీపారాధన చేసి ప్రార్థనలు నిర్వహించారు. సమాధిని కడిగిన నీటిని భక్తులు ప్రసాదంగా స్వీకరించారు.

ఎస్ఎం కృష్ణ మృతి దేశానికి తీరనిలోటు



ఎస్ఎం కృష్ణతో జపానందస్వామి (ఫైల్)

పావగడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే ఆధ్యాత్మిక జీవితాన్ని అలవర్చుకొని ఎన్నోపదవులు అలంకరించిన కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్.ఎం. కృష్ణ మృతి యావత్ భారత దేశానికే తీరనిలోటని పావగడ రామకృష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానంద స్వామి పేర్కొన్నారు. మంగళవారం అర్ధరాత్రి బెంగళూరులోని తన స్వగృహంలో అనారోగ్యం కారణంగా ఆయన తుదిశ్వాస విడిచిన సందర్భంగా ఆయనతో ఆధ్యాత్మిక అనుబంధాన్ని ఆయన తలచుకొని మాట్లాడారు. 2002లో ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు బెంగళూరును హైటెక్‌సిటీగా మార్చేందుకు ఎంతో కృషి చేశారన్నారు. రామకృష్ణ పరమహంస, శారదాదేవి, వివేకానంద స్వామి ఆశీర్వాదం ఆయన ఆత్మకు శాంతి కల్గించాలని కోరారు.

రైతు ఇంట సిరుల పంట



● లాభదాయకంగా పట్టు పురుగుల పెంపకం

● వందశాతం దిగుబడులు.. హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు

పెనుకొండ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఎకరా, అరెకరా పొలాలున్న రైతులు వేరుశనగ, వరి, మొక్కజొన్న, పంటలు సాగుచేసి తీవ్రంగా నష్టపోయేవారు. వారంతా ప్రస్తుతం పట్టుపరిశ్రమవైపు మొగ్గు చూపుతున్నారు. మల్బరీ సాగుచేసి పట్టుపరుగులు పెంపకంతో సిరులు సృష్టిస్తున్నారు. పెనుకొండ డివిజన్‌లో కొండాపురం, మంగాపురం, మహదేవపల్లి, కోనాపురం, రొద్దం మండలంలోని బీదానిపల్లి పట్టురైతులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.



పట్టు పురుగులను మేపుతున్న రైతు.. సేకరించిన గూళ్లు

మల్బరీ సాగులో 60రోజుల్లో రెండుపంటలు తీస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. సీబీ రకం మార్కెట్‌లో రూ.500నుంచి రూ.600వరకు బైవోల్టిన్ రకం రూ.600నుంచి రూ.700దాకా పలుకుతోంది. పెనుకొండ మండలంలో 750ఎకరాలు, రొద్దం మండలంలో 2500ఎకరాలు, సోమందేపల్లిలో 2400 ఎకరాలు, గోరంట్లలో 600 ఎకరాలు మల్బరీసాగు చేస్తున్నట్లు సెరికల్చర్ అధికారులు తెలిపారు. కర్ణాటక లోని సిడ్లగట్ట, డిక్రాస్ నుంచి సీబీ, బైవోల్టిన్ రకం రెండో జ్వరం పురుగులు తెప్పించుకుని పంటను మేపుతున్నారు. 15రోజుల్లో కంటికి రెప్పలా పురుగులు మేపి పట్టుగూళ్లను పండిస్తున్నారు. మార్కెట్‌లో పట్టు గూళ్లకు ధర నిలకడగా ఉంటే మంచి లాభాలు పొందుతామని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు సహకారం: రత్నం, ఏడీ, పట్టుపరిశ్రమ శాఖ

మల్బరీ సాగుచేస్తున్న ప్రతి రైతుకు సహకారం అందిస్తాం. ఉపాధిహామీ పథకం కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మల్బరీ షెడ్లు నిర్మించుకునేందుకు వెసులుబాటు ఉంది. మల్బరీ సాగుచేసే రైతుకు మొక్కకు రూపాయి చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. మల్బరీ రైతులకు ఎప్పటికప్పుడు గ్రామాల్లో సలహాలు అందిస్తున్నాం.

కేజీకి రూ.50 ఇన్సెంటివ్ అందించాలి

మంగాపురం పట్టుపరిశ్రమశాఖ అధికారులు అందించే నూతన విధానంతో పట్టు పురుగులను మేపుతున్నాం. నాకున్న భూమిలో మల్బరీపంట సాగుచేశా. ప్రస్తుతం 200గుడ్లు బైవోల్టిన్ రకం పురుగులను మేపుతున్నాం. బైవోల్టిన్ రకానికి గత ఐదేళ్లుగా కేజీకి రూ.50 ఇన్సెంటివ్ ఇచ్చేవారు. అది కొనసాగిస్తే రైతులకు బాగుంటుంది.

\- నాగరాజునాయక్

పట్టుసాగులో మంచి లాభాలు



నాకున్న మూడెకరాల్లో గత కొన్నేళ్ల నుంచి మల్బరీ పంట సాగుచేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ప్రస్తుతం సీబీ రకం మార్కెట్‌లో రూ.600, బైవోల్టిన్ రూ.700 పలుకుతోంది. ధరలు నిలకడగా ఉంటే మంచి లాభాలే. వంద గుడ్లకు 90శాతం దిగుబడి వస్తోంది.

\-అంజినరెడ్డి, కొండాపురం

రోడ్డు మధ్యలో పశువులు... ట్రాఫిక్‌కు అడ్డంకి

పెనుకొండ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నడిబొడ్డులో ప్రధాన రహదారిలో పశువులు రోడ్డుకు అడ్డంగా పడుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వీటిని అరికట్టాల్సిన మునిసిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు మొద్దునిద్రలో ఉన్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల పశువులు రోడ్డుకు అడ్డంగా రావడంతో పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. ఈ విషయంపై గతంలో పశుయజమానులను‌స్టేషన్‌కు పిలిపించి రోడ్డుపై ఇలాగే వదిలేస్తే పశువులను గోశాలకు తరలిస్తామని హెచ్చరించినా వారి తీరు మారలేదు. ఎన్టీఆర్‌సర్కిల్, మడకశిర సర్కిల్ ప్రధాన రోడ్డులో ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి. సబ్‌కలెక్టర్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్ కార్యాలయాలు, ఆసుపత్రులకు కూతవేటుదూరంలో పశువులు సంచరిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు..



ప్రధాన రహదారిపై అడ్డంగా ఉన్న ఆవులు

బందెలదొడ్డికి తరలిస్తాం: శ్రీనివాసులు, మునిసిపల్ కమిషనర్, పెనుకొండ

ప్రధాన రోడ్లపైకి వస్తున్న సంచార ఆవుల యజమానులకు ఇదివరకే నోటీసులిచ్చి ఫైన్లు వేస్తామని చెప్పాము. అయినా వారి తీరు మారలేదు. రెండు మూడు రోజుల్లో వీటిని బందెల దొడ్డికి తరలిస్తాం.

వడ్డెర్ల భూముల జోలికొస్తే ఊరుకోం



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు

పెనుకొండ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) :నిజాయితీకి మారుపేరైన వడ్డెర్ల భూముల జోలికి వస్తే ఊరుకోమని ఎంతవరకైనా వెళ్తామని వడ్డెర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దేవేళ్ల మురళి, ఇతరనాయకులు పేర్కొన్నారు. గుట్టూరు గ్రామంలో ఓ శుభకార్యానికి హాజరైన సందర్భంగా మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. రొద్దం మండలం ఆర్.ఎల్. కొత్తూరు గ్రామంలో కొన్నేళ్ల క్రితం కదిరి పద్మానాభ నుంచి గ్రామానికి చెందిన నాగరాజు, గంగన్న, హనుమంతప్ప తదితర రైతుల భూములు కొనుగోలుచేసి సాగుచేసుకుంటున్నట్లు తెలిపారు. పద్మనాభరావు కుమారులైన కృష్ణారావు, వసంతరావు, బద్రినాథ్, సత్యనారాయణలు మధ్య విభేదాలు తలెత్తడంతో ఒకరికొకరు ఇష్టానుసారంగా భూములను 1బిలో నమోదు చేయించుకుని ఇతరులకు విక్రయించారన్నారు. అనంతపురం బీ ఏలేరు గ్రామానికి చెందిన రియల్ వ్యాపారికి 158ఎకరాల భూమిని విక్రయించారు. మధ్యవర్తిగా ఉన్న బ్రహ్మానందరెడ్డి సాగుచేస్తున్న రైతుల భూముల్లోకి వచ్చి రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరతామన్నారు. లేనిపక్షంలో జిల్లాలోని వడ్డెర్ల కులస్థులంతా ఆర్ఎల్ కొత్తూరు గ్రామానికి చేరుకుని పెద్దఎత్తున ధర్నాలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీజీపాళ్యం శీన, హనుమయ్య, పల్లవరాజు, గోవిందరాజు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బుడ్డపల్లిలో సర్పంచ్‌పై దాడి

గోరంట్ల, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడిగేపల్లి పంచాయతీలోని బుడ్డపల్లిలో వైసీపీ అనుచరుడు శ్రీనివాసులు, సర్పంచ్ నరసింహ మూర్తిపై మంగళవారం దాడి చేసినట్లు గోరంట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం బుడ్డపల్లి గ్రామానికి ఉపాధి పథకం ద్వారా సీసీరోడ్డుకు రూ.7లక్షల నిధులు మంజూరు చేసింది. గ్రామంలో పనులు ప్రారంభించడానికి వడిగేపల్లి సర్పంచ్ నరసింహమూర్తి వెళ్లారు. వాటర్ సిస్టం పక్కన నివాసముంటున్న శ్రీనివాసులు రహదారిని ఆక్రమిస్తూ నిర్మాణ పనులు చేపట్టారు. వాటి తొలగింపు విషయంలో సర్పంచ్ శ్రీనివాసుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకోగా, సర్పంచ్‌పై చేయి చేసుకున్నట్లు ఆరోపించారు. దీంతో ఎస్ఐ బాబు గ్రామానికెళ్లి దర్యాప్తు చేపట్టారు.

యువకుడిపై ఫిర్యాదు

సోమందేపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సోషల్‌మీడియాలో కూటమి ప్రభుత్వానికి చెందిన నడింపల్లి నాయకుడిని ఉద్దేశించి అసభ్యపదజాలంతో దూషిస్తూ పోస్టుపెట్టిన యువకునిపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ, జనసేన నాయకుల మనోభావాలను దెబ్బతీసేలా పోస్టు ఉందన్నారు. మాజీ ఎంపీపీ వెంకటేశులు, కన్వీనర్ సిద్దలింగప్ప, పట్టణ కార్యదర్శి సూర్యనారాయణ, జనసేన నాయకులు ఎస్ఐ రమేష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అతనిపై కేసు నమోదుచేసి చర్యలు చేపట్టాలని కోరారు.

లారీని ఢీకొని బొలెరో డ్రైవర్ మృతి

పావగడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): లారీని బొలెరో వాహనం వెనక నుండి ఢీకొనడంతో బొలెరో డ్రైవర్ గిరీష్(21) ఎస్.ఎస్.కృష్ణ స్వగ్రామమైన మండ్యా జిల్లా మద్దూరు తాలూకు సోమనహళ్లి గ్రామానికి చెందిన గిరీష్ అనే వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమనహళ్లి గ్రామానికి చెందిన గిరీష్ ప్రతి వారం పెయింట్ డబ్బాలు వేసుకొని పావగడకు వస్తుండేవాడు. మంగళవారం కూడా అదేవిధంగా వస్తున్న సమయంలో పావగడ పట్టణంలోని ఎస్ఆర్ఎస్ పెట్రోల్ బంకు వద్ద ఒక వాహనం యూటర్న్ చేస్తున్న సమయంలో ముందుగా వెళుతున్న లారీ బ్రేక్ వేయడంతో వెనక నుండి వేగంగా వెళుతున్న బొలేరో వాహనం దానిని ఢీకొనడంతో గిరీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేపట్టారు.



నుజ్జునుజ్జయిన బొలెరో వాహనం

ఘనంగా మానవహక్కుల దినోత్సవం

పెనుకొండ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన ప్రభుత్వ పాఠశాలలో జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని ఎన్‌హెచ్ఆర్‌సి ఉపాధ్యక్షుడు నంజుండ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశులు, రాష్ట్ర ఎస్సీఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యుడు ఎంఎన్‌మూర్తి, జాఫర్‌వలి హాజరై ప్రసంగించారు. డీఎస్పీ మాట్లాడుతూ మానవహక్కుల కమిషన్ ఎప్పుడేర్పడింది, ఎలా ఏర్పడింది తదితర విషయాలను వివరించారు. పౌర, మానవహక్కులు, ప్రాథమిక హక్కుల గురించి విద్యార్థులకు తెలియజేసి సమాజంపట్ల, తల్లిదండ్రులపట్ల, తోటి విద్యార్థులపట్ల ఎలా ప్రవర్తించాలో వివరించారు. బాల్యవివాహాలు, తదితర విషయాల గురించి తెలియజేశారు. అనంతరం కేక్‌కట్‌చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. విద్యార్థులకు స్వీట్లు, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కళ్యాణి, ఎన్‌హెచ్‌ఆర్‌సి మహిళా అధ్యక్షురాలు మహబూబ్‌బాషా, పాఠశాల ప్రిన్సిపాల్‌స్వర్ణలత పాల్గొన్నారు.

మానవహక్కుల ఉల్లంఘన అంతర్జాతీయ నేరమే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పెనుకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవహక్కుల ఉల్లంఘన అంతర్జాతీయ నేరమేనని పరిటాల డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో మంగళవారం మానవహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మానవహక్కుల ఉల్లంఘనను తీవ్ర నేరంగా పరిగణించాలన్నారు. హక్కులు వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయన్నారు.

దుకాణానికి నిప్పు.. భారీగా ఆస్తి నష్టం



కాలిపోతున్న దుకాణం

రొళ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలుపనపల్లిలో గంగిరెడ్డి అనే వ్యక్తికి చెందిన కిరాణా దుకాణానికి గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి నిప్పు పెట్టడంతో దాదాపు రూ.90వేలకుపైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఉన్నఫళంగా మంటలు రావడంతో చుట్టుపక్కలవారు ఆర్పే ప్రయత్నం చేశారు. అంతలోనే దుకాణం మొత్తం కాలిపోయింది. రొళ్ల పోలీస్‌స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు గంగిరెడ్డి ఫిర్యాదు చేశారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

గుడిబండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.ఎన్.పల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.6160 నగదును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. పేకాట ఆడుతున్న సమాచారం తెలుసుకొని సిబ్బందితో వెళ్లి జూద కేంద్రంపై దాడిచేసి నిందితులను అరెస్టు నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దుకాణంలో చోరీ

సోమందేపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్తపల్లి క్రాస్‌వద్ద సూపర్‌శే సరుకుల దుకాణంలో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దుండగులు షట్టర్‌ను రాడ్లతో ఎత్తి లోపలికి జొరబడ్డారు. క్యాష్‌కౌంటర్‌లో నగదును తీసుకుని ఉడాయించినట్లు యజమాని దినేష్‌బాబు పోలీసులకు తెలిపారు. దీనిపై ఇంతవరకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు. బాధితుడు ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామన్నారు.

వామ్మో! వానరం

మల్లినమడుగు ప్రజలకు నరకం చూపిస్తున్న కోతి



కోతి కరవడంతో గాయపడ్డ వృద్ధుడు

రొళ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మల్లినమడుగు గ్రామంలో ఓ వానరం ఆ ఊళ్లో వారిని భయభ్రాంతుల్ని చేస్తోంది. సాధారణంగా అందరితో మామూలుగానే ఉన్నా కోపం వచ్చిందంటే మాత్రం దొరికిన వారిని కరిచిపెడుతుంది. దీని కారణంగా రెండు సంవత్సరాల నుండి నరకం అనుభవిస్తున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. దాదాపు 25 మందిని కరవడంతో జనం వేలల్లో ఆస్పత్రికి ఖర్చు పెట్టారు. మంగళవారం ఓ చిల్లర వ్యాపారిని కరివడంతో ఆయన వైద్యం కోసం సొంత గ్రామానికి వెళ్లిపోయాడు. ఇంకా ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో పలువురు కోతి కారణంగా బడికి వెళ్లడం లేదు.

స్కూల్‌కు వెళ్లలేకపోతున్నా: మోక్ష, నాలుగో తరగతి

ఎస్సీ కాలనీ నుండి స్కూల్‌కు రావడానికి భయం వేస్తుంది. కోతి లేకపోతే నేను పాఠశాలకు సొంతంగానే వెళ్లగలను. ఫారెస్టు అధికారులు, పంచాయతీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవవ వడంలేదని, వానరం నుండి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

మసీదు నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి



మంత్రి ఫరూఖ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న పురం మైనార్టీ నాయకులు

హిందూపురం అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): హిందూపురం జామీయా మసీదు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని టీడీపీ హిందూపురం మైనార్టీ నాయకులు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను కోరారు. మంగళవారం నంద్యాలలో మంత్రిని కలిసి వినతి అందించారు. గత ప్రభుత్వంలో నిధులు మంజూరు అయినా నిలిపివేశారన్నారు. తెలుగుదేశం హయాంలో ముస్లింలకు పెద్దపీట వేసి, సీఎం చంద్రబాబు ఆదరిస్తున్నారన్నారు. మసీదుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. మంత్రి స్పందిస్తూ.. తప్పకుండా మసీదుకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో హిందూపురం మైనార్టీ నాయకులు డైమండ్‌బాబా, సయ్యద్ అంజాద్‌ఖాన్, బాషా, అమీర్, అన్వర్ ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు లేకపోతే గ్రామాలు అపరిశుభ్రంగా మారుతాయని మాజీ ఎంపీపీ వెంకటరాముడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని మునిమడుగు గ్రామంలో ప్రపంచ టాయ్‌లెట్ దినోత్సవం సందర్భంగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగరత్నమ్మ, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వచ్చేది మా ప్రభుత్వమే: ఉష శ్రీచరణ్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఉష శ్రీచరణ్

సోమందేపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ పేర్కొన్నారు. మండల పరిధిలోని చల్లాపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన పార్టీ ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. సూపర్‌సిక్స్ ఇంతవరకు అమలుకు నోచుకోలేదన్నారు. మద్యం ధరలు తగ్గించామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వ పెద్దలు రైతులను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పండించిన పంటలకు పంటలు నష్టపోయి గిట్టుబాటు ధరలు లేక రైతన్నలు అలమటిస్తున్నారన్నారు. ఈనెల 13న జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గజేంద్ర, సర్పంచ్ సౌజన్యం, దామోదర్, బాబురెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

గుడిబండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరుబాగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు కలిసి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు కలిసి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాత జ్ఞాపకాలను స్మరించుకొన్నారు. ఈకార్యక్రమానికి ఉపాధ్యాయులు రేవన్న, మహదేవాచార్, రాజగోపాల్, నరసింహారెడ్డి, రవి, సుమంగళి, రంగనాథ్, పాండురంగప్ప, సిద్దేశ్, రంగప్ప, వేణుగోపాల్, హరీష్‌బాబు, కృష్ణమూర్తి, రమేష్, ముద్దీరప్ప, తదితరులు హాజరయ్యారు.

మాలమహానాడు కమిటీ ఎన్నిక

గుడిబండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు మాల మహానాడు మండల అధ్యక్షుడు ఎం.ఆర్. మూర్తి తెలిపారు. మడకశిర నియోజకవర్గం అధ్యక్షులు పాండురంగ మూర్తి, ప్రధాన కార్యదర్శి సోమకుమార్, కోశాధికారి జయరామప్పలను కమిటీగా ఎన్నుకొన్నారు. గౌరవాధ్యక్షులుగా లక్ష్మణ, కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా నరసింహమూర్తి, మూడ్ల గిరియప్ప, ప్రధాన కార్యదర్శిగా గోవిందరాజు, సంయుక్త కార్యదర్శిగా తిప్పేస్వామి, కార్యదర్శులు మంజునాథ్, తిప్పేస్వామి, పాల్గొన్నారు.